అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

అక్టోబర్ - నవంబర్ 1990

124

నేడు.... రేపు....

మతం ముందుకొచ్చింది
మరోసారి
మతం ముంచుకొచ్చింది
మత దాహానికి శవాల గుట్టలు!
గుట్టలమీద విందుకోసం
రాజకీయ రాబందులు!
అఖండ జ్యోతులు, కరసేవలు
పదయాత్రలు, రథయాత్రలు
చివరకు శవయాత్రలు!
పీడిత భారతాన
మసీదును వివాదంగా మార్చి
రామాలయ నిర్మాణాన్ని
పెనుమంటల చితిగా పేర్చి
హిందూ ముస్లిం ఐక్యతను
సజీవదహనం చేస్తున్న
దురహంకారులు!
మనుగడకోసం పోరాడే
మహోన్నత చైతన్యం ప్రజలది!
నేడు మత్తుమందు నిషేధం
రేపు మతం మందు నిషేధం!

—రజని

విషయసూచిక

సంపాదకీయం

రెండు ప్రజావ్యతిరేక ఆందోళనలు		 3

పాటలు - కవితలు

నేడు.... రేపు ...	—రజని	 1
ఉత్తర తెలంగాణ	—ప్రత్యూష	 7
మాయమ్మ ఆలీసమ్మ	—జననాట్యమండలి	 9
పాలమూరు లేబరోళ్ళ పాట్లుసూడరో	—కో. ప్ర.	 10
దేశం ముందుకు పోవాలంటే	—కేతన	 11
పోరాటాల గురువయ్య సారు	—సూరీడు	 13
చేనేత కూలన్నా	—రుద్రజ్వాల	 15
చెల్లిని కొట్టకురా!	—లక్ష్మీసుహాసిని	 16
సర్కార్ మారాలి	—ఎంగపండు	 17
సాధించుకుంటాం! నిలుపుకుంటాం!	—జి. రవీందర్	 31
పరువు పోతే పోనియ్	—గూడూరి గంగాధరరావు	 57
మీ ఓటమంతా....	—ప్రభాత్	 58

కథ

చెప్పుల దండ	—శంకర్	 18

వ్యాసం

సంక్షోభ భారతంలో రిజర్వేషన్ అలజడి	—నటరాజ్	 23

సమీక్ష

వసంత పవనం	—కె.వి.ఆర్.	 33

విరసం విశేషాలు 48

"అరుణతార"కు రచనలు, చందాలు, విరాళాలు పంపవలసిన అడ్రసు

వి. చెంచయ్య

6-5-13, కావలి-524 201, నెల్లూరు జిల్లా.

3 KLVA101M105

సంపాదకీయం

రెండు ప్రజా వ్యతిరేక ఆందోళనలు

ఇవాళ దేశంలో ప్రధానంగా రెండు ప్రజా వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. ఒకటి రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా అగ్రవర్ణ విద్యార్థులు చేస్తున్నదైతే, రెండు- బాబ్రీ మసీదు స్థానంలో రామమందిరాన్ని నిర్మించాలని బి.జె.పి., ఆర్.ఎస్ ఎస్‌లు చేస్తున్నది.

రిజర్వేషన్‌ల సమస్య కులాన్ని ఆశ్రయించుకొని ఉంది. బాబ్రీ మసీదు-రామజన్మ భూమి సమస్య మతాన్ని ఆశ్రయించుకొని ఉంది. ఒకటి కుల సమస్యగా, మరొకటి మత సమస్యగా కనిపించినా, నిజానికి రెండూ మత సమస్యలే. ఎందుకంటే కులం అనేది హిందూమతానికి సంబంధించినదే. ప్రపంచంలో ఏ మతంలోనూ కులం పేరుతో ఇంత దారుణమైన విభజన లేదు. హిందూమతానికున్న ప్రధానమైన జాడ్యం, కులవ్యవస్థ, వేదాంత, యజ్ఞ యాగాలు, వైదిక కర్మకాండలు తమ సొత్తుగానే భావించిన బ్రాహ్మణ పురోహిత వర్గమూ, అంటరానివాళ్ళుగా ముద్ర వేయించుకొని సామాజికంగా, ఆర్థికంగా అణగదొక్కబడ్డ హరిజనులూ- ఇద్దరూ హిందూ మతస్థులే. శ్రీకృష్ణుడు తానేదో గొప్పపని చేసినట్లుగా నాలుగు వర్ణాల్ని సృష్టించినట్లు చెప్పుకున్నాడు. ఆనాటి నాలుగు వర్ణాలు శాఖోపశాఖలై ఈనాటికి నాలుగు వేలకుపైగా కులాల రూపంలో దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. కులవ్యవస్థ ఆధారంగా ఈ దేశంలో హిందూమతం సృష్టించిన మంటల్లో రిజర్వేషన్‌ల సమస్య ఒకటి.

ప్రాచీన కాలంనుండి ఈనాటివరకూ హిందూ మతం ఈ దేశంలోని ఇతర కులాలపైన తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోడానికి ప్రయత్నిస్తూనేవుంది. హిందూమతంలోని దురాచారాల్ని, హింసను వ్యతిరేకిస్తూవచ్చిన బౌద్ధమతాన్ని దారుణంగా అణచివేసింది హిందూమతం. ఇక మళ్ళీ లేవకుండా బుద్ధుణ్ణి ఒక అవతార వ్యవస్థలో భాగం చేసుకుంది. ఈదేశంలోని అనేక తెగలకు సంబంధించిన దేవతలను, దేవుళ్ళను తనలో కలిపేసుకొని స్వతంత్ర వ్యక్తిత్వం లేకుండా చేసింది. ఎప్పటికప్పుడు ఎలాంటి అడ్జస్టుమెంట్లకైనా సిద్ధపడి ఇతర మతాలను, విశ్వాసాలను అణచివేసి లొంగదీసుకోవడమేగాక, తన ఉనికిని కాపాడుకోవడానికి నానా తంటాలుపడుతూ వచ్చింది. ఇలాంటి చరిత్ర కలిగిన హిందూ

మతం ఇవాళ భారత దేశంలో మైనారిటీలుగావున్న ముస్లింలపైకి ఒంటికాలిమీద లెయ్యడం ఆశ్చర్యమేమీ కాదు.

బాబ్రీమసీదు - రామజన్మభూమి సమస్య విషయంలో కోర్టు తీర్పును శిరసావహిస్తామని ముస్లిం నాయకులు ప్రకటించారు. కానీ బి.జె.పి., ఆర్.ఎస్ ఎస్. నాయకులు కోర్టు తీర్పుదాకా ఆగలేమంటున్నారు. అక్టోబర్ 30న రామ మందిరాన్ని నిర్మించాల్సిందేనని పట్టుబడుతున్నారు. దీనికి మద్దతును కూడ గట్టడంకోసం, అంటే మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం కోసం గుజరాత్‌లోని సోమనాథ్ నుంచి అయోధ్యకు రథయాత్రను ప్రారంభించారు. అద్వానీ ప్రారంభించిన రథయాత్ర హిందూమతంలోని అహంకారానికీ, రౌడీయిజానికి నిదర్శనం. ఒకవైపున నక్సలైట్లు రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడు తున్నారని నిందించే బి.జె.పి. తాను బహిరంగంగానే బాబ్రీమసీదు - రామజన్మ భూమి సమస్యలో కోర్టునే అతిక్రమిస్తానంటోంది. అతిక్రమిస్తోందికూడా. కోట్లాది ప్రజల్లోవున్న మతవిశ్వాసాన్ని మతోన్మాదంగా మార్చగలనన్న నమ్మకమే బి.జె.పి., ఆర్.ఎస్ ఎస్‌ల మొండి ధైర్యం. తాత్కాలికంగా ప్రజలు ఈ మతోన్మాదానికి బలయిపోతే పోవచ్చుగాని, అంతిమంగా ప్రజలే ఈ మతశక్తులకు బుద్ధిచెబుతారు.

పదహారవ శతాబ్దంలో రామజన్మభూమి అయిన అయోధ్యలోని రామ మందిరాన్ని పడగొట్టి బాబర్ మసీదును కట్టించాడని హిందూమత నాయకుల ఆరోపణ. అసలు ఈ దేశంలో ఎప్పుడు, ఎవరు, ఏ ఆలయాన్ని పడగొట్టి ఏ ఆలయాన్ని కట్టారో లెక్కలు తేల్చడం అసాధ్యం ఎన్ని బౌద్ధ, జైన ఆలయాలను పడగొట్టి హిందూ మతోన్మాదులు హిందూ దేవాలయాల్ని కట్టుకో లేదు? బాబ్రీమసీదును పడగొట్టి రామమందిరాన్ని నిర్మించాలనుకుంటున్న హిందూమత నాయకులు గతంలో హిందూమతం బౌద్ధ, జైనమతాలకు చేసిన అన్యాయాన్ని గురించి ఎందుకు ఆలోచించరు? చరిత్రలో కొన్ని పొరపాట్లో తప్పులో జరిగిపోయాయి. ఆ పొరపాట్లకూ, తప్పులకూ కారణం ఒక్క ఇస్లాం మతమేకాదు, హిందూమతం కూడా. (బాబ్రీ మసీదును పడగొట్టి రామ మందిరాన్ని కడతామని అనడం- కోతి స్థానంలో మనిషి వచ్చాడు కాబట్టి, ఆ మనిషిని తొలగించి మళ్ళీ కోతిని నిలబెడతా ననడంలాగా ఉంటుంది). గత చరిత్ర అనుభవాలనుండి గుణపాఠాలు నేర్చుకోవాలేగాని, చరిత్రను పునర్ని ర్మించడం సాధ్యంకాదు. మారణహోమంతో, నరమేధంతో రక్త ప్రవాహాల

మధ్య రామమందిరాన్ని నిర్మించ బూనుకోవడం ప్రజాస్వామిక చర్య కాదు. అది హింసాత్మక చర్య. మానవతా వ్యతిరేక చర్య.

ఒకవైపున దేశంలో కోట్లాదిమంది కనీసం గుడిసెకూడాలేక చెట్లకింద, ప్లాట్‌ఫారాలమీద బతుకుతున్నారు. మరోవైపున ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్షలాది ఆలయాలున్న రాముడికి అయోధ్యలో మరో ఆలయం కట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ఆలయమైనా ఏ గొడవలూ లేక, ప్రశాంతంగా తమపాటికి తాము కట్టుకుంటే ఫరవాలేదు మరో మతంపైన తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి పంతంబూని, రక్తపాతానికి సిద్ధపడైనా సరే రామాలయాన్ని కట్టాలని చూస్తున్నారు. దీన్నే మతోన్మాదం అంటారు. ప్రజల సమస్యలతో సంబంధం లేకుండా, ఒక మత వినాశనాన్ని రెచ్చగొట్టి, హింసాప్రవృత్తిని ప్రదర్శించడమే మతోన్మాదం అవుతుంది. హిందూమత నాయకులమని చెప్పుకుంటున్నవాళ్ళు ఇవాళ అలాంటి ఉన్మాద స్థితికి చేరుకున్నారు.

అయితే ఇది కేవలం ఉన్మాదం మాత్రమేకాదు, ఓట్ల రాజకీయంకూడా. రామమందిరంపేరుతో రాష్ట్రాలలోనేగాక, కేంద్రంలోనూ అధికారాన్ని కైవసం చేసుకోవాలన్న తపన బి జె పి కి ఉంది. ఇవాళ బి జె పి కి ఉన్న ఆయుధం అదొక్కటే. శాస్త్రీయమైన పద్ధతిలో, ప్రజాసమస్యల ఆధారంగా ఓట్లను పొందలిగే శక్తిని అది కోల్పోయింది. అదొక్కటే కాదు, ఓట్ల రాజకీయాలలో మునిగి తేలుతున్న ఏ పార్టీకూడా ప్రజల సమస్యల్ని పట్టించుకోవడంద్వారా ప్రజా ఉద్యమాల్ని నిర్మించడంద్వారా ప్రజలవిశ్వాసం చూరగొని ఓట్లుపొందే శక్తిని కోల్పోయాయి. బోఫోర్స్ కుంభకోణాన్ని ఆధారంచేసుకొని రాజీవ్ గాంధీపై తిరుగుబాటు జెండా ఎగరవేసి, కాంగ్రెస్‌నుండి బయటపడి సొంత పార్టీ పెట్టుకొని, అనేక ఇతర పార్టీల మద్దతుతో ప్రధానమంత్రి అయిన వి.పి. సింగ్ తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి, తమ బలాన్ని సమకూర్చుకోడానికి రిజర్వేషన్‌లను ఒక ఆయుధంగా ఉపయోగించుకొంటున్నాడు.

మంత్రివర్గానికికూడ చెప్పకుండా రిజర్వేషన్‌లను ప్రకటించిన వి. పి. సింగ్‌గాని, తమకు చెప్పలేదని గగ్గోలుపెడుతున్న దేవీలాల్ ప్రభృతులుగాని మౌలికంగా వెనుకబడిన వర్గాలపట్ల సానుభూతి ఉన్నవారు కాదు. ఇద్దరూ తమ స్వార్థ రాజకీయాలకు రిజర్వేషన్‌లను ఒక సాధనంగా వాడుకుంటున్నవారే.

సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికోసం వారికి కొన్ని రాయితీలు కల్పించాలనేది రాజ్యాంగంలో పేర్కొన్న విషయమే. దీనికోసం రాజ్యాంగం కల్పించిన సౌకర్యమే రిజర్వేషన్‌లు. రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్‌లను వ్యతిరేకించి, ఆందోళనలకు సిద్ధపడ్డ అగ్రవర్ణాల విద్యార్థులుకూడా రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నట్టే లెక్క.

రిజర్వేషన్‌లవల్లనే ప్రతిభ నాశనం అయిపోయిందని, రిజర్వేషన్‌లతో సీట్లు, ఉద్యోగాలు సంపాదించుకొన్నవాళ్ళు దేశభక్తికి ఉపయోగపడరనీ, అలాంటి ఇంజనీర్లుకట్టే డ్యాములు పడిపోతాయని, అలాంటిడాక్టర్లు పేషంట్లను చంపుతారని ఏవేవో అసందర్భమైన వాదనలు చేస్తున్నారు.

ప్రతిభ అనేది అగ్రవర్ణాలకు మాత్రమే పరిమితమైన ఆస్తికాదు. అవకాశాలున్నప్పుడు ఎవరయినా ప్రతిభను ప్రదర్శించగలరు. తరతరాలుగా కొన్ని వర్గాలను సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కి, ఇవాళ వాళ్ళకు ప్రతిభ లేదనడం ఎలాంటి ప్రతిభో అర్థంకావడంలేదు. ఒకజాతిగాని, ఒక వ్యక్తిగాని చారిత్రికంగా పొందిన సౌకర్యాలు లేకుండా, కోట్లాది ప్రజల శ్రమశక్తి లేకుండా ప్రతిభను ఎలా ప్రదర్శించగలరు? మేధావుల బుర్రల్లోనే అన్నీ పుడుతున్నాయన్న తప్పుడు ఆలోచనా విధానానికి ఇది చిహ్నంకాదా?

ప్రతిభ అనేదాన్ని కేవలం పుస్తకాల చదువుకుమాత్రమే పరిమితంచేసి చూస్తున్నారు. నాగలిపట్టి పొలం దున్ని పంటలు పండించే ప్రతిభవున్న రైతులకు, కూలీలకు భూమిని అప్పజెప్పగలరా? యంత్రాల్ని తిప్పే ప్రతిభ ఉన్నవారికి యంత్రాలపై అధికారాన్ని ఇవ్వగలరా? ఒక్క విద్యా రంగానికేనా ప్రతిభ కావాల్సింది? ఒక్కమాటలో చెప్పాలంటే ప్రతిభకు విలువ ఇవ్వని వ్యవస్థ ఇది. ప్రతిభను గుర్తించని వ్యవస్థ ఇది. అన్ని రంగాలలోని అందరి ప్రతిభను గుర్తించాలంటే ముందు ఈ వ్యవస్థను మార్చుకోవాలి.

శతాబ్దాలుగా ప్రతిభ ఉన్నవాళ్ళు ఈదేశాన్ని పాలించి ఈస్థితికి తెచ్చారు. బ్రిటీషువాళ్ళు వెళ్ళిపోయిం తర్వాతకూడా, ఈనాటికీ అల్ప సంఖ్యాకులైన అగ్రవర్ణాలకున్న సౌకర్యాలు అధిక సంఖ్యాకులైన అట్టడుగు వర్గాల కెక్కడున్నాయి? సంఖ్యా బలాన్నిబట్టి లెక్కగడితే అగ్రవర్ణాలవారే ఈనాటికీ ఎన్నో సౌకర్యాల్ని అనుభవిస్తున్నట్టు తేలుతూంది. అందుకే వెనుక బడిన వర్గాల అభివృద్ధికోసం రిజర్వేషన్‌లు అవసరమయ్యాయి.

ఉత్తర తెలంగాణ

ఉత్తర తెలంగాణ మందునా - ఆ పల్లెల్లో
ఇల్లిల్లు బల్లెమయ్యెనో - ఆ పల్లెల్లో
కత్తుల కోలాట పోరాట దారుల్లో
భూతల్లిని సెరపట్టిన భూస్వామి దొరల్తోని
దోపిడిని గాపాడె పాపి సర్కారుతో
యుద్ధాలె చేస్తుండ్రురా - ఆ పల్లెల్లో
గుద్దిగుద్ది గెదుముతుండ్రురా - ఆపల్లెల్లో

రిజర్వేషన్‌లు ఉన్నా, లేకున్నా అందరికీ ఉద్యోగాలు లేవనేది అసలు రహస్యం. మానవశక్తిని ఎలా ఉపయోగించుకోవాలో మన ప్రభుత్వాలకు తెలియదు. తెలిసినా పట్టించుకోవు. అద్భుతమైన ప్రకృతి వనరులు, కోట్లాది ప్రజల శ్రమశక్తి ఈ దేశంలో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. ఉత్పత్తికి దోహదంచేసే ఉద్యోగ కల్పనగురించి పట్టించుకోకుండా ప్రభుత్వం బాధ్యతారహితంగా ప్రవర్తిస్తోంది. అందరికీ వారివారి అభిరుచులకూ, శక్తి యుక్తులకు తగిన ఉద్యోగాలు చూపించగలిగిననాడు రిజర్వేషన్‌ల సమస్య అదృశ్యం అయిపోతుంది. ఈ అవగాహన రానంతవరకూ పాలకవర్గాలు రిజర్వేషన్‌లను ఆధారం చేసుకుని విద్యార్థిరంగాన్ని ఆడిస్తూనే ఉంటాయి.

ప్రజలకు సమస్యలు ఉన్నంతకాలం వాళ్ళను ఎవరు కదిలిస్తే వాళ్ళ వెనకాల వెళతారు. అది ప్రజల అవసరం. ఆ అవసరాన్ని ఆసరాచేసుకుని ప్రయోజనాలు పొందడానికి కొన్నిపార్టీలు ప్రయత్నిస్తుంటాయి. రిజర్వేషన్లను ప్రకటించడంద్వారా వి.పి. సింగ్ ప్రయోజనం పొందాలనిచూస్తే, రిజర్వేషన్ లను వ్యతిరేకించడంద్వారా మరికొన్ని పార్టీలు లాభపడాలని చూస్తున్నాయి. ఈ రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమంలో బి.జె.పి, ఎ.బి.వి.పి. శక్తులుకూడా పని చేస్తున్నాయి. వాళ్ళ దృష్టిలో హిందూమతం అంటే అగ్రవర్ణాలవారి హిందూ మతమే. అందుకే ఇటు రిజర్వేషన్‌ల సమస్యను, అటు బాబ్రీమసీదు - రామ జన్మభూమి సమస్యను తమ కనుకూలంగా మార్చుకోవాలని హిందూ మతతత్వ శక్తులు ప్రయత్నం చేస్తున్నాయి. ఈ రెండు ప్రజావ్యతిరేక ఆందోళనల్లోను హిందూ మతతత్వమే విజృంభించి తన సహజ స్వరూపాన్ని నగ్నంగా ప్రదర్శించుకుంటోంది. ఈ ప్రజావ్యతిరేక ఆందోళనలను ఎదుర్కొని, సరైన ప్రజాఉద్యమాన్ని నిర్మించడమే ప్రజాస్వామికవాదుల కర్తవ్యం.

ఎత్తులపై ఎత్తులేసి కత్తుల వలలు పన్ని
ఉత్తర తెలంగాణ నెత్తురులో ముంచెయ్య
ఆ యుద్ధం ఆపనీకిరో - ఆ పల్లెల్లో
ఖాకీల కుక్కల దోలిరా - ఆ పల్లెల్లో
ఖానూన్‌పై కత్తిగట్టి కయ్యమాన దమ్మెంతని
అన్నగాల్ల మాటలిని ఆడితిరి పాడితిరని
దొరలకెదురు తిరిగిమీరు మర్లబిర్ల పడితిరని
పల్లెపల్లె సుట్టుముట్టిరో - ఆ పల్లెల్లో
సెల్లెల్ల సెరిసి సంపిరా - ఆ పల్లెల్లో
పల్లెలోని జనాన్నంత పసులతీర్గ కొట్టినారు
అన్నగాల్ల సూపుమని హరిగోస పెట్టినారు
సీదవిచ్చేటోల్ల ఇండ్లు కూడుబెట్టేటోల్ల ఇండ్లు
కూల్చికూల్చి కాడుచేసినా - ఆ పల్లెల్లో
జాడసీడ జూపలేదురా - ఆ పల్లెల్లో
గంగోలె పొంగుతున్న జంగునాప జనంనాప
లుచ్చగాల్ల చేరదీసి ఉచ్చులెన్నో ఏసినారు
జంగునడిపె నా యన్నల దొంగదెబ్బ తీసినారు
నేలతల్లి ఒడిలోనరా - ఆ పల్లెల్లో
నెత్తురు ముద్దయ్యి ఒరిగిరా - ఆ పల్లెల్లో
సెలకల్లో మొలిసినట్టి పోరాట మొలకలాను
తల్లూలు సెల్లెలంతా రైతుకూలి అన్నలంత
విద్యార్థి యువకులంత రణంచేసె వీరులంత
అలయి బలయి తీసుకోనిరో - ఆ వీరులూ
అగ్గయ్యి లేసిరిచూడు - ఆ పల్లెల్లో
తెలుగుదేశం గడ్డంత పొగలు సెగలు కక్కినాది
ఉత్తర తెలంగాణ కత్తుల పిడుగులయ్యి
రైతు గెరిల్లా పోరు ఆగదని సాగునని
సర్కారోని గుండెల్లోరో - ఆ పల్లెల్లో
గుప్పుగుప్పు మండుతోందిరో - ఆ పల్లెల్లో ॥ఉత్తర॥

— ప్రత్యూష

మాయమ్మ ఆలీసమ్మ

అమ్మ నీకు వందనం
మాయమ్మ ఆలీసమ్మ
తల్లి నీకు వందనం
మాయమ్మ ఆలీసమ్మ
కారంచేడు భూస్వాముల
కడుపుల్లో కత్తివైన ॥అమ్మ॥
పొద్దంత పనిచేస్తే
పస్తుల బతుకెనీది
ఎద్దోలె పనిచేస్తే
ఎండిన పేగునీది
నీబతుకునంత దోసి
బలసిన దొంగ దొరలు
నీ బతుకుల మన్నేసిరా
మాయమ్మ ఆలీసమ్మ
నీకుతెక్క బిక్క సంపిరా
మాయమ్మ ఆలీసమ్మ ॥అమ్మ॥
మేం మనుష్యులయ్యినందుకు
మనుషులా చూడుమన్నవ్
మా పల్లెమీద దొరల
ఇక జులుం చెల్లదన్నవ్
ఆ విషకండ్ల దొరలు
గూడెం చూదొద్దన్నవ్
దొరలు పగబట్టిరా
మాయమ్మ ఆలీసమ్మ
నీ గుడిసెకు నిప్పెట్టిరా
మాయమ్మ ఆలీసమ్మ ॥అమ్మ
కాల్లు, సేతు లాడనప్పుడు
నీకు కళో గంజో బోసే
ఇండ్ల దీపంబెట్టి
నువ్ సస్తే అగ్గిబెట్టి

దయగల్ల సెమలు గల్ల
నీ కొడుకు వందనాని
దొరకెదురు తిరిగినట్టి
నీ కొడుకు వందనాని
నీ కండ్లముందే నరికిరా
మాయమ్మ ఆలీసమ్మ
నీ కడ్పు కగ్గిపెట్టిరా
మాయమ్మ ఆలీసమ్మ ॥అమ్మ॥
నవమాసములు మోసి
వనవాసమెంతో దీసి
నువ్ సగం కడ్పు తింటూ
నువ్ సాది పెంచుకున్న
నీ నెత్తురుగుడ్డునేమో
కత్తులతో పొడ్సినారు
సెట్టంత నీ కొడుకూ
గుట్టోలె కూలిపాయె
ఆఖరి చూపు చూసి
అమ్మా అని పిలిసే
కడసారి కొడుకునేమొ
నీ కండ్ల కద్దుకున్నావ్
పగదీర్చుకుంటానని
ప్రతిజ్ఞ చేశావ్
నువ్ సిగముడి విప్పావమ్మో
మాయమ్మ ఆలీసమ్మ
నువ్ సింహామై లేసినవ్
మాయమ్మ ఆలీసమ్మ ॥అమ్మ॥
పూలు పండ్లు తీసుకొని
పేరంట మొచ్చినట్లు
ఎంటోడు వచ్చినాడు
పదివేలు ఇస్తానని

నీ గదప బట్టుకుండు
పైసొద్దు ఫలం వొద్దు
నీ కన్నకడుపు తీపి
కన్నకొడుకు నిమ్మన్నవ్
నీ కొడుకు నివ్వకుంటనో
మాయమ్మ ఆలీసమ్మ
నువ్ కాశినొతనన్నవో
మా.యమ్మ ఆలీసమ్మ ॥అమ్మ॥
ఎంటోడి దుర్మార్గం
ఎన్నాండ్లో సాగదన్నవ్
దగ్గుబాటి దొరల జులుం
దెగ్గర బడ్డదన్నవ్
ఎంటోడి ఇయ్యంకుడికి
ఎయ్యాలి ఉరి అన్నవ్
నరహంతకులు వీళ్ళని
సాక్ష్యం చెప్తానన్నవ్
గొంతెత్తి ఈ సత్యం

లోకంతో చెప్తనన్నవ్
నీ గొంతుబిస్కి సంపిరా
మాయమ్మ ఆలీసమ్మ
నీ పంతము తుడిపేసిరా
మాయమ్మ ఆలీసమ్మ ॥అమ్మ॥
కారంచేడు చావదు
కథగాదిది కసి అన్నవ్
కుములుతున్న తల్లి
ఇక కుంపటౌతదన్నవ్
చెరచబడ్డ సెల్లి
సేస్తర్ యుద్ధమన్నవ్
పల్లె పల్లె బుట్టి
నేను మల్లొస్తనన్నవ్
దొరల నీడనైతనంటివా
మాయమ్మ ఆలీసమ్మ
దొరల పాడనైతనంటివా
మాయమ్మ ఆలీసమ్మ ॥అమ్మ॥

[భూస్వాముల - బూర్జువాల కాళ్ళకింద నలిగిపోయిన కోట్లాది బానిస తల్లుల కన్నీళ్ళ తుడ్సి ఆ తల్లుల బాసలను, వాస్తవాలుగా మార్చిన నక్సల్‌బరీ బిడ్డలకు కృతజ్ఞలతో]

— జననాట్యమండలి

పాలమూరు లేబరోళ్ళ పాట్లు సూడరో

పాలమూరు లేబరోళ్ళ పాట్లుసూడరో - ఆ పాట్లు సూడరో
పాట్లు తెలిసి పోరుదారి - సాగిరమ్మురో.... ॥పాలమూరు॥
పనికి మారుపేరు - పాలమూరు లేబరు
ప్రాణం పోతున్నగాని - పనే ముఖ్యమంటరు
పొద్దులస్తం పనిచేసి - పొట్ట మాడ్చుకొంటరు ॥పాలమూరు॥
జిల్లేకాదు రాష్ట్రమైన రాదంటరు అడ్డము
రాతలు మార్చలేని - రాత్రి పగలు కష్టము
రాతమార రణంచేయి రాదులేర నష్టమూ ॥పాలమూరు॥

ఇంటికాడె ఇంతో అంతో - ఇచ్చి తోలుకొస్తరు
ఎద్దులోలె మమ్మల్ని - ఎట్టిచేయమంటరు
గొడ్డులోలె మాకింత - గంజి కాసి పోస్తరు
పనిలోన పుచ్చిపుచ్చి - ప్రాణమూ మీదికొచ్చి
సచ్చినకాని మాకు సావుఖర్చు లియ్యరు
పశువుకన్న హీనమయిరి - పాలమూరి లేబరు ॥పాలమూరి॥

బిల్డింగులు కట్టిన - బుడ్డపైస రాలేదు
డ్యాములు నిర్మించిన - దొక్క పైకి లెయ్యలేదు
నీటి కాల్వలు తొవ్విన - కన్నీరు ఆగలేదు
పట్టిగడ్డ యిరిగి పడితె - మట్టిపాలె ఈ బతుకు
ట్రిప్పర్ల కింద నలిగి - తుంపలయ్యె ఈ బతుకు
వడదెబ్బలు తగిలి తగిలి - వాడిపోయె ఈ బతుకు
దళారీల చేతుల్లో - దాసియైన ఈ బతుకు
చేసిచేసి వాడేమొ - సద్దిలేక సస్తుండు
దోచేటి నా కొడుకు - దొరలాగ బతుకుతుండు
ఎన్నేళ్ళు ఈ బతుకు - ఎన్నాళ్ళు ఈ బతుకు
ఈ బతుకు మనకొద్దు - ఈ బాధలు మనకొద్దు
పారలు తిరగేసి మనం - ప్రపంచాన్ని మార్చుకొందాం
॥పాలమూరు॥

— కో. ప్ర.

దేశం ముందుకు పోవాలంటే....

దేశం ముందుకు పోవాలంటే అందరు చదువులు చదవాలంట విద్యార్థిసోదర
॥ దేశం॥

చదువుసంధ్యలే తెలివితేటలని - తెలివితేటలే జీవన భుక్తని
చదివిద్దామని గంపెడాశతొ - కూలితండ్రి నిను తీసుకపోతె
అప్లికేషనుకు రెండ్రూపాయలు - ప్రభుత్వ రుసుము పదిరూపాయలు
ఆదాయపు పత్రం వుండేచాలు - రుసుమిచ్చేపని లేదని చెప్పిరి
రూపాయలుపెట్టి పత్రం దెచ్చి - సంతకాలకని తీసుకపోతె
గుమస్తా కైదు ఆరై కైదు - తాశీల్దారుకి పదిరూపాయలు

హరిజన గిరిజన పేదపిల్లలకు ఎన్నెన్నో సదుపాయాలంటా విద్యార్థిసోదర
॥దేశం॥

బడిమొదలయ్యి పదినెలలైనా - పుస్తకా లచ్చుకాలేదంట
పరీక్షలేమొ ముంచుకువచ్చె - పుస్తకాలసలు అంతేలేవు
మంత్రుల మాటలు కోటలుదాటె - పుస్తకాలేమొ చేతులుదాటె
అంతుచిక్కనీ పుస్తకాలన్ని - చీకటిబజారు చేరుకున్నవి
అసలురేటుకి రెట్టింపైతేనె - అప్పుడు బయటికి వస్తనన్నవి
అంతరేటు నువు పెట్టలేక మరి - పుస్తకాలు కొనలేకపోతివి
ఉపాధ్యాయులు తమ విధియనుకొని - ఏదో ఒకటి చెప్పుకుపోతే
చెప్పిందేమీ అర్థంకాక - వ్రాయటానికి ఏమీరాక
వచ్చిందేదో రాసుకపోతె - పరీక్షదప్పి ఏడుపువచ్చె
అన్నిటికంటే విద్యారంగం ఎంతోముందుకు పోతుందంటా విద్యార్థిసోదర
॥దేశం॥

తెలుగు పంతులూ సూర్యుడు అంటే - భగవంతుడని చెప్పినాడురా
సైన్సు పంతులూ సూర్యుడు మండే - అగ్నిగోళమని చెప్పినాడురా
అర్థంకాని చదువులుచెప్పి - విద్యార్థిని పెడమార్గం బెట్టి
కులమతభేదం చదువుకులేదని - మనమందరము సమానమేనని
గాంధీగారిది కోపటి కులపట - అంబేద్కరుది హరిజన కులమట
పాఠశాలలో మొక్కలు పెంచుట - కళాశాలలో కప్పలుగోయుట
వ్యర్థమైన ఈ చదువులుచెప్పి - విద్యార్థులను వెధవలుచేసి
రెండుముక్కలు లెక్కలుచెప్పి - గుమ్మస్తాలుగా తయారుచేసిరి
మంచిచదువుకై సమ్మెలుచేస్తే రాడికల్సనీ జైల్లోబెట్టిరి
నేటిబాలలే రేపటిపౌరులు రేపటిపౌరులె భావిబానిసలు విద్యార్థిసోదర ॥దేశం॥
పగలూరేయీ ఈ చదువులనే - కంఠతబట్టి పరీక్షనెగ్గితె
ఉద్యోగానికి ఖాళీలేదు - బతుకుతెరువుకు దారీలేదు
ఉన్నవి కొన్ని ఖాళీలైనా - వాటికి మళ్ళీ లంచాలడిగిరి
లంచంబెట్టే ఓపికలేక - మంచంపట్టే కూలితండ్రి
పేదవాడినీ డబ్బులేదనగ - అది నీ ఖర్మా ఇంటికిపొమ్మనె
కష్టపడటము చేతగాక - మరి ఉద్యోగానికి నోచుకోక
నిరాశతోటి నిరుద్యోగివై - బజారులెంటా సోమరివైతివి
ఓట్లనాయకులు దేశాన్నెంతో ముందుకు తీసుకుపోతున్నారు విద్యార్థిసోదర
॥దేశం॥

దేశ ప్రగతికి పూలబాటలు - విప్లవవీరులు విద్యార్థులురా
నేటి చదువులే దోపిడిదొంగల - చేతుల్లోని ఆయుధాలురా
ఈ దోపిడివ్యవస్థ కూలేదాకా - విద్యావ్యవస్థ మారబోదురా
నిరుద్యోగమును పెంచే చదువును - నిలువున చీల్చి పాతిపెట్టరా
పాఠశాలలే పోరుబాటలుగ - పోరాటమే నీ పాఠ్యగ్రంథముగ
చక్కటి పచ్చటి బతుకులకోసం - బతుకులుమార్చే చదువులకోసం
రాజ్యం కోరలు పీకటానికీ - దోపిడి ప్రాణం తీయటానికి
ప్రజాపోరు కెరటాలనుజూడ - ఎత్తిన ఎర్ర జెండానుజూడు
దేశం ముందుకు పోవాలంటే సాయుధపోరును సాగించోయీ విద్యార్థిసోదర
॥2, 3 సార్లు॥

(సంక్రాంతి రోజుల్లో పాడుకొనే "గొబ్బియల్లో చందామామా - చందా మామా, చందామామా.... ఓ .. చందామామా" అనే జనం బాణీలో)

—కేతన

పోరాటాల గురవయ్యొ సారు

ఎర్రాఎర్రని దారులల్లో - ఎర్రాపూల దారులల్లో
యాడికెల్లిపోయినాడె - ఎర్రాఎర్రని గురవయ్యాసారు
పోరెల్లిపోయినాడె - పోరాటాల గురవయ్యాసారు

1. నైజాముకు ఘోరిగట్టె - నాటి తెలంగాణ పోరు
పోరులోన ప్రభవించిన శూరుడు - గురవయ్యాసారు
నక్సల్బరి తరంలోన - నడక నేర్చెను గురవయ్యాసారు
చారుబాబు దారిలోన - చేరినాడె గురవయ్యాసారు ॥ఎర్రా॥

2 బట్టలుతికి బతికేటి - పేద కుటుంబంలో పుట్టి
సమాజంలో మురికినంత - సమూలంగ మార్చివేయ
సాయుధంగ కదలమనే - సాహసి మా గురవయ్యాసారు
చచ్చి బ్రతకమనిచెప్పే - చల్లని మా గురవయ్యాసారు ॥ఎర్రా॥

3. ఎమర్జెన్సి వామపక్ష - నియంతృత్వ మనుకుంట
రివిజనిస్టు కుక్కలన్ని - ఇందిర పాదాలు పడితె
ఎమర్జెన్సి కత్తి అంచు - కాలిబాటలల్లో నడిచి

ప్రజలగుండె కొండలల్లో - పోరుపూత పూయిస్తూ
ఏటి కెదురీదినాడె - ఎర్రాపూల గురవయ్యసారు
కత్తులపై నడిచినాడె - కమ్యూనిస్టు గురవయ్యసారు ॥ఎర్రా॥

4. గుంటూరు కార్మికుల - గుండెలల్లో దాగి నీవు
గోల్డెన్ కంపెనీ కార్మికులను - గుండె గట్టిగ చేసుకొమ్మని
సమ్మెలుగట్టి సవాల్ జేసి - కంపెనీవాడి మెడలువంచి
ఈస్టిండియా టుబాకోలో - విప్లవభేరి మ్రోగించావు
ఎమర్జెన్సీ చీకటి గుండెకు - చిచ్చుబెట్టెను గురవయ్యసారు
ఎర్రజెండకు ఎదురులేదని - చాటినాడే గురవయ్యసారు ॥ఎర్రా॥

5. పసికూనల వదిలినాడు - ప్రజలల్లో గలిసినాడు
రక్త సంబంధంకన్నా - వర్గసంబంధం మిన్నని
ప్రజలకొరకు నిండు బ్రతుకు - ఫణంబెట్టి నిలిచినాడు
పీడితజన పక్షపాతి - ప్రజాయుద్ధ గురవయ్యసారు
రగులుతున్న ప్రజాపోరు - రైతుకూలి గురవయ్యసారు ॥ఎర్రా॥

6. కడుపుకోసి పేగులుదీసి - ముక్కలు ముక్కలు మళ్ళీ కలిపితె
ప్రాణాలకు ముప్పని పదేపదే హెచ్చరిస్తే
కంచపదీసి కడుపుగట్టి - కాలిబాటలన్ని నడిసి
మృత్యువును మూడుమార్లు - సవాల్ విసిరి సవాల్ విసిరి
ప్రజలే నా ప్రాణమనే - పోరాటాల గురవయ్యసారు
పార్టీ నా ప్రాణమనే - కమ్యూనిస్టు గురవయ్యసారు ॥ఎర్రా॥

7. నీ రక్తమంత పీడిత జన - విప్లవాల వెల్లువలో
ఆయుధంగ మలచిన - అమరుడు గురవయ్యసారు
నీయుక్తి నీశక్తి - నీత్యాగం మహోన్నతం
మృత్యువు మానుండి నిన్ను - వేరుచేసి నవ్వినా
ఎర్రజెండ వెలుగులలో - ఎర్రాఎర్రని గురవయ్యసారు
సదా వెలుగుతుంటవులే - ఎర్రాఎర్రని గురవయ్యసారు ॥ఎర్రా॥

— సూరీడు

చేనేత కూలన్నా!

— రుద్రజ్వాల

ఇంక సూత్తవేంది నేతకూలన్నా!
ఇప్పటికే ఆలస్సెం అయిందోరి చేనేత కూలన్నా ॥ఇంక॥

కొటాయిల్లో[1] గుడిసెల్లో
గుంటకు నిను కట్టేసుక
గుండె చేతబట్టుక నువ్
గుడ్డలెన్నొ అందిస్తే
గుడ్డబట్టి బిర్రేదని
గునగునమని షావుకారు
మెత్తగ లేదనియంటూ
మిటకరించి చూచినాడు
షైనింగ్ చాల్లేదంటూ
చిర్రెత్తిపోయినాడు
సరుకు గిట్టదని కులికి-
సగం కూలి కోతగోసి
సాటుమాటు గల్లాపెట్టె
సర్దుకొని పొంగినాడు ॥ఇంక॥
పిల్లాదీ పనిజేసీ
పస్తులు నువ్ పడుకుంటే-
చీకటితో లేసిగూడ
చీకటి నువ్ మోస్తుంటే-
పచ్చానికి[2], పండక్కి-
తెచ్చినప్పు తెమలకుంటె-
బిడ్డపెళ్ళి చేయలేక
బాధలు నువు పడుతుంటె-
ఇల్లు సరిగ గడపలేక
ఇరుకునబడి చస్తుంటె-
కూలి పొగళ్ళిచ్చినోడు
కులాసాగ కూర్చున్నడు;

ముందు మజూరిచ్చినోడు
మేడమీద మేడలేపి,
స్కూటరు మోటారులెక్కి-
సోకులెన్నో పోతన్నడు ॥ఇంక॥
ఇంటిగోస ఇనలేకా
ఇంచెనకను నక్కినట్టు
కొనకోరిక తీర్చుకోను
కుందేరు[3]కు గుట్టుగెళ్ళి
చీట్ల పేకలో నువ్వా
చెయ్యిగలిపి కూర్చుంటే
చీటాటా పెట్టినోడు
జేబులన్నీ ఊడ్చేసి
చినుగుచొక్కా నిప్పదీసి
చెప్పకుండ బొమ్మన్నడు ॥ఇంక॥
ఊరట వచ్చిన దినమున
బారు దింపి కూలిదెచ్చి
పట్నంలో సుకమేదో
బావుకోను బైటబడితే
బస్సోనరి కండెక్టరు
చిల్లరంత పట్టేస్తె
సిన్మహాలు గట్టినోడు
సగం డబ్బు సరిజేస్తె-
మెదడంతా తొల్సి బొమ్మ
మెడనుదట్టి పొమ్మన్నది ॥ఇంక॥
నీ కండల సారమంత
నంజుకునే షావుకారు-

నీ చాకిరి కమీషనుగ
గుంజుకునే దళారోడు-
నీ నిపుణత సంపదగా
నిల్పుకునే ఎక్స్‌పోర్టర్-
చోటుమార్చి భద్రంగా

ఆట నడుపు కల్పోనరు-
నల్లదొరకు నిచ్చేసేసి .
నిను బురిడీ చేస్తున్నరు
దొరతనాన్ని కూల్చకుండ
దొరకదింక దారినీకు ॥ఇంక॥

1. చేనేతకూలీలు పనిచేసే చోటు 2. 24 మీటర్ల గుడ్డ
3. జాంగ్రపేట పక్క ఏరు

చెల్లిని కొట్టకురా!

– లక్ష్మి సుహాసిని

[అమ్మ నన్ను సాగనంపు అమరుల తోవలోన....బాణీలో]

ఒద్దురా నా కన్నా! చెల్లిని కొట్టకురా
నీలోనే ఉంటుంది – నీ తోడుగుంటుంది
గెరిల్లా పోరులోన సాయుధ మవుతుంది ॥ఒద్దురా॥

1. చిట్టిచిట్టి కథలే చెప్పు – పోరన్నల త్యాగం చెప్పు
నిర్మలక్క శౌర్యం చెప్పు – అంకమ్మ దారినె చూపు
ఆ దారిలోన మీరు ముందుకే సాగాలి ॥ఒద్దురా॥

2. అమ్మగా మీచెంత – రేపు నేను లేకున్నా
పోరుమాట మరవొద్దు – పోరుదారి విడవొద్దు
ఎర్ర జెండ బట్టి మీరు ముందేవుండాలి ॥ఒద్దురా॥

3. ఆడదాన్నయినందుకు – అడుగడుగునా ముళ్ళే
కళ్ళనీళ్ళ కొరతలేదు – గుండెనిండ గాయాలె
ఈ బతుకుపైన పోరు చెయ్యాలిరా కన్నా ॥ఒద్దురా॥

4. ఎర్రనైన బాటలో నేను – బందూకె పడతాను
నాలోటి చెల్లెళ్ళ 2 కన్నీళ్ళనీ తుడిచి
అవమానాల బతుకు – అంత మొందిస్తాను
నన్ను మీ ఇద్దరూ – నవ్వుతూ పంపించి
చెప్పాలి రెడ్ శాల్యూట్స్ మరువకురా కన్నా ॥ఒద్దురా॥

సర్కార్ మారాలి

గుజిమల్లీ పూలో - గుజిమల్లీ పూలో
అన్నోరె మాయన్న - ఓ రైతు అన్నా ॥గుజి
జీవితం పాటనీ నువు నేర్చుకోరా ॥గుజి
పాట నేర్చి నువు - పోరాడ రారా ॥గుజి
వి.పి. సింగ్, కాంగ్రెస్ - సర్కారులొకటే ॥గుజి
సెట్టు గుట్టా నరికి - సేని పండించే ॥గుజి
ఆకలికి తింటావు - ఆకుల్ని నీవు ॥గుజి
పోడుభూములు దున్ని - పొవ్వాకు పెంచి ॥గుజి
పట్టగొడుగులు తిని - పొట్ట నెప్పంటావు ॥గుజి
నీ తిండిపంటలూ - తీసుకున్నోలూ ॥గుజి
సంతలో షావుకార్లు - సర్కారు జాదూ ॥గుజి
సోకు బట్టలుతొడిగి - సెంటూలే రాసి ॥గుజి
మోటారు బల్లెక్కి - షీకార్లుగొడుతూ ॥గుజి
మేలైన మేడల్లో - మెదులుతున్నారు ॥గుజి
ఆల చేతుల్లోన - రాజ్యమున్నాది ॥గుజి
అందుకే హాయిగా - బతుకుతున్నారూ ॥గుజి
ఆల బతుకులు మనకి - రావాలి అంటె ॥గుజి
పేదోళ్ళ మందరము - బందూకుబట్టి ॥గుజి
దొంగ సర్కారునే - తరిమిగొట్టాలి ॥గుజి
రాజ్యానికి రైతు రాజుకావాలి ॥గుజి
అప్పుడే మనమంత - హాయిగుంటాము ॥గుజి
గుజిమల్లీ పూలో - గుజిమల్లి పూలో

– వంగపండు

చెప్పుల దండ

— శంకర్

"శ్రీరామ మరణభూమి సంగతేమిటి? ఎప్పుడూ జన్మభూమి గోలేనా?" విసుక్కున్నాడు ఒక ప్రతిభావంతుడు. అది స్వరతీయ ఘనతాపార్టీ సమావేశం,

ఇంతలో ఒక యువకుడు హఠాత్తుగా వచ్చి "కొంప మునిగి పోయింది అంతా కొట్టుకుపోయింది"

"తుఫానా? ప్రతి సంవత్సరం ఉండేదే కదా! ముఖ్యమైన ఆధ్యాత్మిక విషయాలు ఆలోచిస్తూంటే నీ గోలేమిటి?"

"పూరిగుడిసెలు కాదు సార్. ప్రతిభ కొట్టుకుపోయింది"

"ఎవరామె? రాజకీయ నాయకురాలా? ఏ కులం? ఏ మతం? ఏ గోత్రం? ఏ నక్షత్రం?"

"అయ్యో, ప్రతిభంటే మెరిట్"

"దేంట్లో ప్రతిభ? ఎవరి ప్రతిభ?" ఒక తక్కువ ప్రతిభావంతుడి ప్రశ్నల పరంపర ఇది.

"నోర్ముయ్, వెధవ ప్రశ్నలు" గద్దించాడు అద్వానం స్వరతీయఘనతా పార్టి అధ్యక్షుడు.

"మేం శ్రీరాములవారి ఇంటి స్థలం సమస్యను గురించి ఆలోచిస్తున్నాం. ఇంతలో ఈ సమస్య. దేశమంతా సమస్యలే. కాశ్మీర్, పంజాబ్, అస్సాం, ఆంధ్రాలో నక్సలైట్లు దేశ సమగ్రతకి, సమైక్యతకి, సంపూర్ణతకి, జాతీయతకి". అసలు సమస్య అర్థంకానపుడు అరిగిపోయిన పాత ఉపన్యాసం క్యాసెట్ ఆన్‌చేసి, ఈలోపులో తలూపాలా, వ్యతిరేకించాలా, తప్పించుకు తిరగాలా, ఎక్కువ లాభం? ఎంత లాభం? ఎన్ని ఓట్లు, ఎన్ని సీట్లు? వీటన్నిటిని గురించి ఆలోచించడం ప్రతిభాశాలి అద్వానంగారికి అలవాటే.

"ఏసంగతి స్పష్టంగా చెప్పకుండా ఉపన్యాసం దంచితే, నేనూ తిరిగి దంచగలను సార్. పాయింటుకు రండి. ప్రతిభని ఉరితీసింది ప్రభుత్వం."

"ఐతే ఈసంగతి ప్రజాస్వామ్యయుతంగా చర్చిద్దాం"

"ఎవరితో?"

"పార్టిలో అంతర్గతంగా, బహిర్గతంగా, వేరే పార్టిలతో, అమ్మలతో, బాబాలతో, స్వాములతో, శ్రీరాముడితో, శ్రీకృష్ణుడితో"

"నువ్విలా చర్చిస్తూ కూర్చో, మేం గంగలో దూకి ఛస్తాం"

"పుణ్యలోకాలకు పోతావు నాయనా" ఒక భజరంగభళి

"మేం మాత్రం త్రిశంకుస్వర్గంలో వేళ్ళాడ్తాం. ఇలాంటి సందర్భాల్లో ఇటు మన మహా హిందువులు, అటు ఓట్లేయవలసిన అలగా హిందూమంద" అన్నాడు అద్వానం.

ఇంతలో ఒక పెద్దమనిషి లేచి "సమావేశం ఆలశ్యమయ్యేట్లుంది. నేను వెళ్ళడం ఆలశ్యంచేస్తే మా బిల్డింగ్ కాంట్రాక్టర్ ఇసుకలో సిమెంటు కలిపేస్తాడు. వాడికి కాస్త ప్రతిభెక్కువ" అంటూ బయటికి పోయాడు.

"అసలు కొట్టుకుపోయిన ప్రతిభ విలువెంత? దాని బరువెంత? దాని జన్మభూమెక్కడ? నష్టపరిహారం ఎంత చెల్లించాలి? ఎవరికి? ఇవన్నీ తేల్చాలి" అన్నాడొక సందేహ ప్రతిభ.

"పార్టి క్రమశిక్షణని అతిక్రమిస్తున్నావ్ సేవక్! రామజన్మభూమి గురించి ఇలాంటి చచ్చుప్రశ్నలే వేసి మా తల తిన్నావ్, ఇప్పుడుకూడా...."

"క్రమశిక్షణంటే ఏమిటి గురూజీ!"

"చెప్పింది వినాలి, నోరెత్తకూడదు. మహాసేవక్! వీడికి సూదీదారం ఇవ్వు" ఆజ్ఞాపించాడు అద్వానం.

"సరే, ప్రతిభంటే మన కార్యకర్తలకి అర్థమయ్యేలా ఈ వార్త మోసుకొచ్చిన ప్రతిభగారే వివరిస్తారు. అదే సత్యం, అదే తథ్యం, 'మిగిలిందంతా మిధ్య" అద్వాన్నం చేసిన ఈ ప్రతిపాదనకి ఆయన మీసంతోబాటు అందరూ తలలూపారు అంగీకార సూచకంగా.

"ప్రతిభంటే మనకున్నది, వాళ్ళకు లేనిది. అలగావెధవలకి లేనిది. వేదాంతచర్చలు, పూజాపునస్కారాలు చేస్తూ, ఆనందానుభూతికోసం కాస్తంత మద్యం సేవిస్తూ, మనిషి జీవితపరమార్థమైన శృంగార కళని తగినంతగా పోషిస్తూ మనం ఉదాత్తంగా జీవిస్తున్న రోజుల్లో ఈ అలగాజనం ఏం చేస్తున్నారు? రోడ్లూడుస్తూ, బట్టలుతుకుతూ, చెప్పులు కుడుతూ, మన పీతుళ్ళెత్తుతూ మన పొలాలు దున్నుతూ, మొరటుగా బతికారు. మనువు, శంకరాచార్యుడు మొదలయిన ప్రతిభావంతులంతా మనవాళ్ళే ఊరిచివర బతుకుతున్న ఈ వెధవల్ని పోసీలేయని సంతకం నేర్చుకోమంటే, ఉద్యోగంలో రిజర్వేషన్లదాకా వచ్చారు. ఇది అధర్మం, అన్యాయం, అవినీతి"

"రామ్‌రామ్ ప్రతిభారామ్, సీతాసహిత ప్రతిభారామ్"

"ప్రతిభాసహిత సీతారామ్" ఒక భజగోవిందం చెక్కభజన. "ప్రతిభా పురస్సర, అగ్రేసర, అధస్సర" ఒక ప్రతిభాసేవక్ కర్రసాము.

"ఇపుడేంచేద్దాం? బస్సులు కాలుద్దామా? ఆఫీసులు కూలుద్దామా? కాల్చేద్దామా, పేల్చేద్దామా?" ప్రతిభగాడు రెచ్చిపోతున్నాడు.

"అవన్నీ నక్సలైట్లు చేసేపనులు...." అనుమానించాడు అద్వానం.

"నక్సలైట్లు కూడ వేదాలలోంచే ఈపద్ధతుల్ని స్వీకరించారు సార్. హోమం అంటే తగలబెట్టడమే కదా! మంత్రాలకి బదులు నినాదాలిస్తూ తగల బెడతాం అంతే".

"ఆహా! ఏం ప్రతిభ? కానియ్ కాని మా స్వరతీయపార్టి మాత్రం తెర వెనకుంటుంది. హిందూధర్మానికి ఓట్లుపడాలంటే మన పార్టి మేలిముసుగు వేసుకోవాలి. మేలిముసుగుకూడ హిందూధర్మమే, రాజధర్మమే"

"అది కుదరదుసార్. మీవైఖరి బయటపెట్టాలి. మీరు నగ్నంగా రంగంమీదికొస్తే నాటకం బాగా రక్తికడుతుంది"

"అందరూ రంగంమీదకొస్తే వెనకెవరుంటారు? మీకింకా రాజధర్మం తెలియదు. మేమేకాదు, మీవెనక చాలామందే ఉంటారు. నెహ్రూని కొన్ని విషయాల్లో తిడతాం. కాని ఆయనకూడ ప్రతిభావంతుడైన హిందువే. ప్రతిభ లేని హిందువుల్ని తరిమివేయడానికి ఆయన సంతానంకూడ మీవెనకే వస్తుంది. వామపక్షాలు, దక్షిణ పక్షాలు, ఉత్తర పక్షాలు అన్నీ ఒకేజెండాలో రంగులు నాయనా! పత్రికలంటావా? నీ ప్రతిభ కందనిదేముంది? మన ముడ్డికింద వేసుక్కూచోవడానికే అవి" పక్కికిలించాడు అద్వానం.

"అసలీ రిజర్వేషన్‌లకు కారణం ఎవరు?" ఒక సహస్రాధిక వయో వృద్ధుడి ప్రశ్న.

"అంబేద్కర్". ఉలిక్కిపడ్డాడు ముసలాడు. ఏడవడం మొదలెట్టాడు. జుట్టుపీక్కున్నాడు. "వాడు హంతకుడు నాయనా! నన్ను నడివీధిలో కాల్చి చంపాడు. రాజస్థాన్‌లో ఒక ఆడముండని హిందూధర్మం ప్రకారం సహ గమనం చేయిస్తూంటే ఎంతిమంది ఏడ్చారు? కాని నాలాంటి వేలసంవత్సరాల ప్రతిభావంతుడు చస్తూంటే కొందరు మన ప్రతిభా కులాలవాళ్ళుకూడ కేరింతలు కొట్టారు నాయనా! అలగాజనం సంగతి చెప్పేదేముంది? ఇన్నివేల సంవత్స రాలు బతికి దిక్కులేనిచావు చచ్చాను నాయనా!"

"ఎవరు సార్ మీరు?"

"మనువుని. ధర్మశాస్త్ర కర్తని"

"పిశాచమా!?" భయంగా ప్రతిభావంతుడు.

"ఔను. నేను పిశాచాన్నే. కాని అలగాజనం పాలిట పిశాచాన్ని. ప్రతిభావంతులకు మిత్రుణ్ణి. ప్రతిభావంతులైన పిశాచాల్ని గోరీలుతవ్వి అద్వానం గారు బయటకు తీసుకువస్తున్నారు కదా! రాముడితోబాటు నేనూ బయటికి వచ్చాను. శ్రీరాములవారుకూడ మంచి ప్రతిభావంతులు నాయనా! శంబూకుడి వధ, సీతని అగ్నిప్రవేశం చేయించడం ఇవన్నీ నీకు తెలుసుకదా!

"మనువుగారూ! మీకు కారంచేడు కథ తెలుసుకదా?"

"తెలుసు నాయనా! కొందరు ప్రతిభావంతులు చెప్పారు"

"నేను కారంచేడు ప్రతిభావంతుణ్ణి"

మనువు ఆప్యాయంగా కావలించుకొన్నాడా ప్రతిభగాడిని.

ప్రతిభావంతుడు మనువుగారి ఆజ్ఞను అనుసరించి అంబేద్కర్ మెడలో చెప్పులదండ వేశాడు. అంబేద్కర్ చిరునవ్వుతో "పూలదండవేసి నన్ను అవమానించనందుకు కృతజ్ఞతలు. ఆ ఘుమఘుమలాడే పూలు కోట్లాది శ్రమ జీవుల్ని అవమానించాయి. వాళ్ళని వెలివేసిన దేవుడి నెత్తిమీదికెక్కి ఖరీదైన కలలుగా మిగిలిపోయాయి. ప్రభుత్వము, ధనికులు నన్ను నా వర్గంనుంచి విడదీయడానికి, ఓట్లు దండుకోడానికి నన్ను పూలదండలతో హింసించారు. హిందూ మతోన్మాదులుకూడ పూలదండలతో నన్నొక పూజావిగ్రహాన్నిచేశారు. కాని శ్రమచిహ్నాలైన ఈ చెప్పులు నా మెళ్ళోవేసి నన్ను మీరు గౌరవించారు. శ్రమజీవులు ఈ చెప్పుల్ని తమ చెమటోడ్చి తయారుచేశారు. అవి మీ ప్రతిభావంతుల కాళ్ళని ఆప్యాయంగా కాపాడాయి. కంటకావృతమార్గాలలో మీ పురోగమనానికి సాయపడ్డాయి. కాళ్ళు సెప్టిక్కై మీ బ్రహ్మానందం చెదిరిపోకుండా కాపాడాయి. కాని ఆ చెప్పులన్నా, చెప్పులు కుట్టేవాళ్ళన్నా మీకు చులకన. మీరు చెప్పులు తయారుచేసే మమ్మల్నే ఊళ్ళోకి చెప్పులు వేసుకు రాకూడదని శాసించారు. మేం తయారుచేసిన, మాకు అక్కరకు రాకుండా పోయిన చెప్పులు మాకు మళ్ళీ దక్కాలి. అదే మా కోరిక. ఓ ఆకాశసౌధ ప్రతిభావంతులారా! మీరు ఆకాశంలోనే నడవండి.

"ఔను. మేం ఆకాశంలోనే నడుస్తాం. రాకెట్లు నిర్మించేది మేమే. రోదసికి పోయేదీ మేమే."

"కాని మీకు పంటలు పండించి బువ్వందించేది మేమే"

"భూమి మిధ్య, రజ్జుసర్పభ్రాంతి, ఆకాశం సత్యం, శాశ్వతం, సూక్ష్మం"

"ఆహా! ఏం హిందూ ఫిలాసఫీ? ఏం ప్రతిభ?" ఆమోదసూచకంగా తలలూపాయి పిల్ల ప్రతిభలు.

ప్రతిభావంతుడు డొనేషన్‌లు కట్టి మహా ప్రతిభావంతు డయ్యాడు. ప్రతిభా కులీనులు అతన్ని మరింత పైకి లాగారు. ఇంతింతై వటుడింతై అమెరికాలో అడుగుపెట్టాడు. పరాయి దేశంలోకంటె జన్మభూమిలోనే ప్రతిభకు ఎక్కువ వెల గిడుతుందని తెలిసి ఖర్మభూమికి వచ్చేశాడు ఆలయాలకు కాంట్రాక్టరుగా పనిచేస్తున్నాడు. ప్రతిభావంతుడు డబ్బు సంపాదించడమేకాక రాజకీయాలనుకూడ నడపాలని ఆలోచించి ప్రముఖ నాయకుడు అద్వానం దగ్గరి కెళ్ళి "నేను రెండేళ్ళ క్రితం చెప్పులదండ వేశానే, ఆ విగ్రహంవున్న స్థలమే రామ మరణభూమి సార్ రాముడి విగ్రహాన్నే పడగొట్టి మాల నాయకుడి విగ్రహాన్ని ఉంచారు సార్"

"నీకెలా తెలుసు?"

"రాత్రి పెద్ద వెలుగులో దివ్యతేజస్సుతో రాముడు కనిపించి చెప్పాడు సార్."

"ఆహా! శ్రీరామచంద్రుణ్ణి కనులారాదర్శించిన భాగ్యవంతుడివి నాయనా కాని ఇది కలియుగం, త్రేతాయుగం కాదు. మన హిందూరాజ్యం రాగానే అక్కడకూడా రామవిగ్రహం ప్రతిష్ఠించి తద్దినం వైభవంగా జరుపుదాం. రామ మరణభూమి, దళితవిగ్రహం సమస్య గురించికూడా ప్రముఖ నాయకులు చేటపేయ్‌గారితోను, రాజమాతతోను చర్చిస్తాను" అలా రాజకీయాల్లో వేలెట్టాడు మన ప్రతిభగాడు.

ఒక పెద్ద రామాలయమూ, తన ఇల్లు ఒకేసారి కట్టించడం మొదలు పెట్టాడు మన మహా ప్రతిభాకాంట్రాక్టరు. రెండూ ఒకేసారి పూర్తయ్యాయి. ఆ మహాభక్తుడు తన ఇల్లు కట్టినచోటు రాముడు ఒంటేలుకెళ్ళిన పవిత్ర పుణ్య తీర్థమని దివ్యజ్ఞానంద్వారా తెలుసుకొని ప్రచారంచేశాడు. దాంతో ముడుపులు బాగావచ్చి, అంతస్తులు పెరిగిపోతున్నాయి. ప్రతిభగాడు పైపైకి పోతూ వేదాంతం చదువుకొంటున్నాడు.

ఐతే అతడు కాంట్రాక్టరుగావుండి కట్టించిన రామాలయం కూలి అద్వానంగారు అర్థాంతరంగా మరణించారు. "సిమెంటుమీదకంటే అతనికి ఇసుక మీద మక్కువ ఎక్కువని, అందువలననే ఇదివరలో ఒక డ్యామ్, ఇప్పుడు ఆలయం కూలిపోయాయని ప్రతిభలేనివాళ్ళ ఆరోపణ. "గిట్టనివాళ్ళ మాట అది. ఖర్మకాలి కూలిపోయింది. ఖర్మ మరీబాగాకాలి ఆయన చచ్చిపోయాడు" అన్నారు ప్రతిభావంతుడి అనుచరులు. ఇప్పుడు ప్రతిభావంతుడు నాయకుడై అభినవ అద్వానంగా పేరు తెచ్చుకొన్నాడు.

వ్యాసం

సంక్షోభ భారతంలో రిజర్వేషన్ అలజడి

— నటరాజ్

సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ శాశ్వత సంక్షోభంలోపడి కొట్టుమిట్టాడుతోంది. అగ్రరాజ్యాలు తమ సంక్షోభంనుండి బయటపడేందుకు వెనుకబడిన దేశాలను పావులుగా వాడుకొంటున్నాయి. సంక్షోభ భారాన్ని వెనుకబడిన దేశాలపైకి నెట్టుతున్నాయి. అందుకే దేశాలు స్వాతంత్ర్యాన్ని, ప్రజలు స్వేచ్ఛను, జాతులు విముక్తిని కోరుతున్నాయి. ఇది విప్లవాల యుగం

మన దేశంలోని ప్రభుత్వాలు ఎన్ని మారుతూవచ్చినా పాలనా స్వభావం ఒక్కటే అయినందున ఏ ప్రభుత్వమైనా పాలకవర్గ ప్రయోజనాలను కాపాడేందుకే కృషిచేస్తోంది. దేశంలో ఏమూల చూసినా ఆందోళన, అసంతృప్తి.

తన ప్రతిభవల్ల ఎంతసాధించాడో వివరించి బుద్ధిచెప్పేందుకు అంబేద్కర్ విగ్రహం దగ్గరికి అర్ధరాత్రి వెళ్ళాడు ప్రతిభావంతుడు. ఆశ్చర్యం! అక్కడ అంబేద్కర్‌కు బదులుగా ఒక పేదవాడు చిరిగిన గుడ్డలతో, చిక్కిన దేహంతో ఉన్నాడు.

"నాయనా! ఎన్ని కష్టాలలోవున్నావ్. రామరాజ్యం రానీ నిన్ను డైరెక్టుగా శంబూకుడుండే స్వర్గానికి పంపిస్తాం" కళ్ళకు గ్లిజరిన్ రాసుకొంటూ అన్నాడు ప్రతిభగాడు ఆ పేదవాడి కళ్ళు నిప్పులు కురిపించాయి.

"పోలీస్! ఈ నక్సలైట్‌ని కాల్చెయ్" అరిచాడు. ఎవరూ లేరు.

"రామా! రఘురామా! శంబూకవధాపరాయణా! చెట్టుచాటునుంచయినా ఒక్క బాణం ప్రతిభతో వేసి రక్షించవయ్యా"

ఆ పేదవాడు అప్పటికే ధనుస్సును ఎక్కుపెట్టాడు ప్రతిభావంతమైన అతని బుర్రవైపు. ప్రతిభగాడు గుండాగి చచ్చాడు. వాడి ఏ సి. బిల్డింగు కూలిపోయింది. అక్కడొక చెప్పుల దుకాణం వెలిసింది.

- రిజర్వేషన్‌లు వొద్దా? అయితే ఆస్తిని, సామాజిక గౌరవాన్ని సమానంగా పంచండి
- రామమందిరం కావాలా? అయితే ముందు కోట్లాది నిరాశ్రయులకు పూరిగుడిసెలు కట్టండి.

[విప్లవ రచయితల సంఘం, చిత్తూరు జిల్లా యూనిట్]

ఏ రాష్ట్రంచూసినా ఉద్యమాలు, ఉద్రిక్తత. ఏ రంగంలో చూసినా జీవన్మరణ సంఘర్షణలు. దేశంలో 80 శాతం ప్రజానీకం 20 శాతం సంపదను కలిగి ఉంటే, కేవలం 20 శాతం ప్రజానీకం 80 శాతం సంపదను కేంద్రీకరించు కొంటే సమస్యలు పరిష్కరింపబడేదెలా? అసంతృప్తితోవున్న మనసు అందుబాటులోవి ఆధారం ఇంకొకరి వశం కావడం సహించలేకపోతోంది. అందుకే 'యాచక యాచకోశత్రుః' అన్నారు. కాని అవసరం ఎంత? అందు బాటు కొచ్చేదెంత? అది ఎవరికి చెందేది, అనే అంశాన్ని వదిలి ఎదుటవున్న ప్రతిదాన్ని శత్రువుగా చూసే స్వభావాన్ని అలవరచుకొంటున్నామనే విష యాన్ని ఆలోచించడంలేదు. అందులో భాగమే ఈనాడు కొనసాగుతున్న ఆందోళన. ఈ ఆందోళనకు మన దేశంలోని సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలకు మధ్యనవున్న సంబంధాన్ని ప్రతిఒక్కరూ ఆలో చించి, మన సమిష్టి బాధ్యతను గుర్తించాలి.

మన దేశంలో కొనసాగుతోన్న ఈనాటి సామాజిక వ్యవస్థను సమూ లంగా నిర్మూలించి దానిస్థానే నూతన సామాజిక వ్యవస్థను నిర్మించకుండా ఏ సమస్యకూడ పరిష్కరించబడదనే విషయాన్ని గుర్తించవలసివుంది. దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఈకాలంలో కొనసాగించిన పోరాటాలలోని న్యాయమైన కోరికలు ఈ సామాజిక వ్యవస్థ ఇలా ఉండగానే పరిష్కారంకావు. నిరు ద్యోగం పోవాలన్నా, ధరలు అదుపులోకి రావాలన్నా ఈ దేశం పారిశ్రామికం కావాలి. దున్నేవానికే భూమి చెందాలి.

దేశం పారిశ్రామికం కావడానికి ఒకప్పుడు బ్రిటిషు ప్రభుత్వం అడ్డంకి అయితే ఇప్పుడు కోట్లాది రూపాయలు అప్పుపెట్టి మనదేశాన్ని తాకట్టు పెట్టు కోవడంద్వారా సామ్రాజ్యవాదులు, సోషల్ సామ్రాజ్యవాదులు అడ్డంకిగా ఉన్నారు. మనదేశ పారిశ్రామిక ఉత్పత్తి సామ్రాజ్యవాద దేశాలకనుగుణంగా రూపొందుతున్నది. అందుకు సాధనంగా మనదేశంలో దళారి బూర్జువావర్గం పనిచేస్తోంది. అధికారంలోవున్న పాలకవర్గ పార్టీలు ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా సామ్రాజ్యవాదులకు ఏజెంట్లుగా తయారవడమేగాక, ఇటు దేశం లోని భూస్వామ్య విధానాన్ని రక్షించుకొనేందుకు భూస్వాములతో రాజీపడింది. అందువల్ల నేటి సామాజిక వ్యవస్థను అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థగా పిలుస్తున్నాము ధరలు విపరీతంగా పెరిగిపోవడానికి, ఉత్పత్తి నానాటికీ క్షీణించిపోవడానికి, నిరుద్యోగం దినదినం పెరిగిపోవడానికి ఈ ప్రభుత్వాల

విధానాలే కారణం. అందువల్ల కార్మికవర్గం నాయకత్వం క్రింద కార్మిక, కర్షక ఐక్యతా పునాదిపై జనతా ప్రజాతంత్రవ్యవస్థను నిర్మించుకోతప్ప పై సమస్యలు ఏవీ పరిష్కారం కావు. అందువలన ముఖ్యమైన పాక్షిక సమస్యల పరిష్కారంకై జరిగే పోరాటాలు, సామాజిక వ్యవస్థను మార్చేందుకు జరిగే పోరాటాలు ఈనాడు ఒకటిగానే తయారయినాయి. ఈ విషయాన్ని చైతన్య స్ఫూర్తిగా గుర్తించి యావత్తు భారత ప్రజానీకంచే గుర్తింపజేయడం విద్యార్థి జనసామాన్యం ముందున్న ప్రధాన బాధ్యత. దీనిని గుర్తించకుండ ఎన్ని సాహసోపేతమైన పోరాటాలు సాగించినా అనుకున్న లక్ష్యాన్ని సాధించలేము అనేది ఈనాడు ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవలసిన అంశం. ఈనాడు కొన సాగుతున్న 'రిజర్వేషన్' అనుకూల, వ్యతిరేక వివాదాల ఘర్షణ సంఘటిత మవుతున్న విద్యార్థులను, ఉద్యమాలను బలహీనపరచి పాలకవర్గ ప్రయోజనాలను కాపాడేందుకే దోహదపడుతుంటాయి.

మొదటిసారిగా భారత దేశంలో అల్పసంఖ్యాకుల, వెనుకబడిన వర్గాల పరిరక్షణ అనే భావనను బ్రిటిషుప్రభుత్వం ప్రవేశపెట్టింది బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ ఉద్యమం ఒక బలమైన శక్తిగా రూపొందుతున్నప్పుడు విభజించి పాలించే పద్ధతిగా ప్రజాశక్తిని బలహీనపరిచేదిగా 1909 చట్టం అమలులోనికివచ్చి ముస్లిములకు ప్రత్యేక రాజకీయ నియోజకవర్గాలను రూపొందించినారు. తర్వాత 1935 భారతప్రభుత్వ చట్టం అల్పసంఖ్యాకుల న్యాయసమ్మతమైన ఆసక్తులను కాపాడే ప్రయత్నం చేసింది. అనాటినుండి క్రమక్రమంగా ప్రజాఉద్యమహోరు పెరిగేకొద్ది దాని తాకిడినుండి రక్షణ పొందేందుకే ఈ రాయితీల సంస్కరణలు అమలులోనికి వచ్చాయి.

బ్రిటిషువారినుండి అధికారమార్పిడి జరిగినతర్వాత భారత పాలక వర్గాలు సమాజంలోని సంపదపై గుత్తాధిపత్యం వహించి, వెనుకబడినవర్గాల ప్రయోజనాలకు రాజ్యాంగంలో కొన్ని రాయితీలు ప్రకటించారు. ఆర్టికల్ - 16 (4) ఆర్టికల్ 335 వెనుకబడిన తరగతులకు, హరిజన గిరిజనవర్గాలకు ఉద్యోగాల్లో రాయితీలు కల్పించారు. ఆర్టికల్ 330 - 332 ప్రకారం పార్లమెంటులోను, శాసనసభలలోను ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయింపులు చేశారు. ఆర్టికల్ - 334 ప్రకారం 30 ఏళ్ళతర్వాత ఈ కేటాయింపులు రద్దయిపోతాయి. అంటే వెనుకబడిన తరగతులు ఈ ముప్పయి సంవత్సరాలలో ఉన్నత వర్గాలతో, పాలక వర్గాలతో సమానస్థాయికి ఎదుగుతారనే భావన. ఇది రాజ్యాంగపరంగా

వెనుకబడిన వర్గాలకు రాయితీలు (రిజర్వేషన్‌లు) కల్పించామనే డాంబికాలేగాని ఇంకేమీలేదు. ఎవరు వెనుకబడిన వర్గాలు, ఎవరు అభివృద్ధిచెందిన వర్గాలు అనే స్పష్టత రాజ్యాంగంలోగాని, రాజ్య పాలకులలోగాని ఇప్పటివరకుకూడ లేదు. దీనిపై ప్రారంభంనుండి ఇప్పటివరకు భిన్నమైన, పరస్పర విరుద్ధమైన భావాలను వ్యక్తీకరిస్తున్నారు. అంటే ఇది పాలకవర్గాన్ని పదిలపరుస్తూ ప్రజలను భ్రమల్లో ముంచేందుకే తోడ్పడుతోందని స్పష్టంగా ఎవరికయినా అర్థమౌతోంది.

1953 సం॥లో వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ సమస్యపై గాంధేయవాది కాకాసాహెబ్ కాలేల్కర్ అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటుచేశారు. ఆ కమీషన్ దేశవ్యాప్తంగా 2899 కులాలను వెనుకబడిన వర్గాలుగా గుర్తించి 70 శాతం జనాభాను జాబితాలో చేర్చింది. అంటే దేశంలో 70 శాతం ప్రజానీకం బీదరికంలోవుంది. తర్వాత వెనుకబడిన తరగతులవారికి కల్పించే రిజర్వేషన్ విధానంపై తమ పట్టం గడుపుకోవడానికి వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాలకై కమీషన్‌లనువేశాయి. వాటిలో ముఖ్యంగా బీహార్‌లోని "ముంగేరిలాల్ కమీషన్", గుజరాత్‌లో "రాణేకమీషన్", కర్నాటకలో "వెంకటస్వామి, జస్టిస్ చిన్నపరెడ్డి కమీషన్", ఆంధ్రప్రదేశ్‌లో "మురళీధరరావు కమీషన్"లు.

జనతాపార్టి అధికారంలోకి వచ్చినతర్వాత దేశంలోని అసమానతలను తొలిగించి ప్రజలకు గొప్ప పరిపాలన అందిస్తామనే ప్రచారంతో 1-1-1979న బి.పి. మండల్ అధ్యక్షతన వెనుకబడిన తరగతుల రిజర్వేషన్‌పై మరో కమీషన్ ఏర్పాటయింది. ఇది 1980లో ప్రభుత్వానికి తన రిపోర్టును అందజేసింది. 'మండల్ కమీషన్' దేశవ్యాప్తంగా 3743 కులాలను వెనుకబడిన వర్గాలుగా గుర్తించి దేశంలో 52 శాతం జనాభాను ఆ జాబితాలో లెక్కగట్టినట్లు తెలిపింది. అయితే దానినికూడ అప్పటి ఇందిరాగాంధి ప్రభుత్వం అటకఎక్కించింది.

మన రాష్ట్రంలో మురళీధరరావు కమీషన్ వెనుకబడిన కులాలను 93 నుండి 102 వరకు పెంచుతూ గుర్తించింది. తెలుగుదేశం ప్రభుత్వం అదనంగా 44 కులాలనుచేర్చి 146 కులాలు వెనుకబడినవర్గాలుగా ప్రకటించింది.

ఈమధ్యకాలంలో అధికారంలోకి వచ్చిన జనతాదళ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత 'మండల్ కమీషన్'ను బూజుదులిపి వివిధ రాష్ట్రాల

లోని ప్రభుత్వాలు గుర్తించిన కులాలలోని 90 శాతం కులాలు, మండల్ కమీషన్‌లోని 90శాతం కులాలు ఒకటేనని, ఆ 90శాతం కులాలకు రిజర్వేషన్ వర్తింపజేస్తామని వి.పి. సింగ్ ప్రభుత్వం ప్రకటించుతోంది

ప్రస్తుత విధానంవల్ల కేంద్రస్థాయి ఉద్యోగాలలో షెడ్యూలు కులాలకు 15 శాతం, షెడ్యూలు తెగలకు 7.5 శాతం, వెనుకబడిన తరగతులకు 27 శాతం మొత్తం 49.5 శాతం రిజర్వేషన్‌కు కేటాయింపు జరుగుతుంది. ఐతే ఇంతకుముందు జరుగుతున్న కేంద్రప్రభుత్వ నియామకాలలో కేవలం ఎస్‌సికి 15 శాతం, ఎస్‌టికి 7.5 శాతం మాత్రమే రిజర్వేషన్ ఉండేది. వెనుకబడిన వర్గాలకు అసలు రిజర్వేషన్ ఉండేదికాదు. ఇప్పటివరకు జరిగిన నియామకాలలో వెనుకబడినవర్గాలుగా చెప్పబడుతున్న కులాలనుండి కేవలం 12 శాతం మాత్రమే కేంద్రస్థాయి ఉద్యోగాలలో నియామకమైనారు. కమీషన్ సూచించిన 52 శాతం వెనుకబడిన వర్గాలలోని జనాభా దేశంలోవుంటే కేవలం 12 శాతం మాత్రమే ఉద్యోగావకాశం కలిగింది దానినే ఇప్పుడు "మండల్ కమీషన్"ద్వారా 27 శాతానికి పెంచారు. అయినా మొత్తం రిజర్వేషన్ సుప్రీంకోర్టు తీర్పు పరిధిలోని 50 శాతంలోపే ఉందికదా! అంతేకాకుండా భారతదేశంలోని ఉద్యోగావకాశాలుగాని, విద్యావకాశాలుగాని ప్రభుత్వరంగ సంస్థలలోకంటే ప్రయివేట్‌రంగ సంస్థలలోనే ఎక్కువగా ఉన్నాయి. అట్టి ప్రయివేట్‌రంగ సంస్థలలో విద్యావకాశాలకైనా, ఉద్యోగావకాశాలకైనా ఎక్కడయినా రిజర్వేషన్ పద్ధతిగాని, రాయితీలుగాని కనిపిస్తున్నాయా? జీతభత్యాల విషయంలోగాని, ఫీజులవిషయాలలోగాని ఏమైనా ప్రత్యేక సదుపాయాలు కనిపిస్తున్నాయా? అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. కేవలం నామమాత్రంగా మంజూరయ్యే కేంద్రస్థాయి ఖాళీలలో రెండు, మూడు ఖాళీలకు ఇంత రాద్ధాంతం జరగడం వాస్తవ పరిస్థితులను అవగాహన చేసుకోవడంలోని లోపమే అవుతోంది. "ఫలితాన్ని తప్ప క్రమాన్ని చూడకపోవడం ఫ్యూడల్ ప్రాపంచిక దృక్పథమే అవుతుంది". మండల్ కమీషన్‌లోని పట్టికను గమనిస్తే కేంద్ర ప్రభుత్వోద్యోగుల నియామకం ఏ తరగతుల వారికి ఎక్కువగా జరిగిందో ప్రతిఒక్కరూ అవగాహనకు రాగలరు. →

మండల్ కమీషన్ రిపోర్టులోని అంశాలు

క్రమ సంఖ్య	కార్యాలయం/డిపార్టుమెంటు మొదటితరగతి ఉద్యోగాలు	మొత్తం పదవులు	ఎస్సీ/ఎస్టీ కులాలకు	బిసి కులాలకు	ఎఫ్‌సి కులాలకు
1.	రాష్ట్రపతి కార్యాలయము	49	4	-	45
2.	ప్రధానమంత్రి ,,	35	2	1	32
3.	క్యాబినెట్ సెక్రటేరియట్	20	1	1	18
4	ఆర్థికశాఖ కార్యాలయము	1008	66	1	941
5	పరిశ్రమశాఖ ,,	169	16	3	150
6.	విద్యాశాఖ ,,	259	17	4	238
7.	రక్షణశాఖ ,,	1379	48	9	1322
8.	న్యాయశాఖ ,,	502	55	16	431
9.	హోంశాఖ ,,	409	19	13	377
10.	అటమిక్ ఎనర్జి ,,	34	-	-	34
11.	లేబర్ ,,	74	4	-	70
12.	స్పేస్ శాఖ ,,	19	-	-	19
13	యుపిపిఎస్సి ,,	163	12	3	148
14.	ఎస్సీ, ఎస్టీ కమీషన్	10	1	-	9

మన దేశంలో వెనుకబడిన తరగతులను గుర్తించడంలో ఒక నిర్దుష్టమైన నిర్వచనం లేదు. ఏ రాజకీయపార్టీ అధికారంలోవుంటే దాని కనుగుణంగా మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. వివిధ కమీషన్‌లు వెనుకబడిన వర్గాలుగా కులాల ప్రాతిపదికతోనే గుర్తించాయి. "1953 వెనుకబడిన వర్గాల కమీషన్" అధ్యక్షుడు కాకాసాహెబ్ కాలేల్కర్ "కులాన్ని ప్రస్తావించకుండా ఉండాలని ప్రయత్నించినప్పటికీ ప్రస్తుతపరిస్థితులలో అలా చేయలేకపోయాం" అని తెలిపారు.

భారతదేశంలో 'కులం' ఒక వాస్తవిక అంశం. భారతావనిలోని కులాలు తరతరాలనుండి సామాజిక జీవన ప్రవంతిలో కలిసివున్నాయి. మన సామాజికస్థితిని అవగాహన చేసుకొన్న ప్రతి ఒక్కరికి తెలుసు ఈ విషయం. కుల ప్రాతిపదికపైననే రిజర్వేషన్ జరుగుతోందనే విమర్శకు అర్థంలేదు. ఈనాటి సాంఘిక, రాజకీయ రంగాలలో కులప్రాధాన్యత లేనిచోటు ఎక్క-

దైనా ఉందా? కులం ఉండకూడదనే వాదనచేసే "మహామేధావులు" అందరు కుల ప్రమేయంరాగానే ఎవరికివారేపులకరించిపోతూన్న సంగతులు కోకొల్లలు. "వామపక్షులు"కూడ కులప్రసక్తి రాగానే ఎవరిగూటికివారే చేరుతున్న సంఘటనలు ఎన్నిలేవు? ఇవాళ వారంతా కులాన్ని దుయ్యబట్టడం వాస్తవాన్ని వక్రీకరించడమే అవుతుంది. మనం ఎంత అరచి గీపెట్టినా కులం దాని ఉనికిని కాపాడుకొంటూనే ఉంటుంది. అది సంస్కృతిలోని మౌలికాంశాలలో ప్రధానమైనది. ఇది చారిత్రక వాస్తవం. కులాలు వర్గాలకు ప్రాధాన్యత కలిగిస్తున్నాయి. కొన్ని కులాలు కొన్నివర్గాలకు ప్రాతినిధ్యం చేస్తున్నాయి. ప్రస్తుత కాలపరిస్థితులలో అది తప్పదు. మనం ప్రస్తుతం వ్యతిరేకించి, నిర్మూలించవలసింది కులతత్వాన్నికాని కులాన్నికాదు. కులతత్వాన్ని వదలి కులాన్ని మాత్రమే నిందించడంవల్ల ప్రయోజనం లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు 30 లక్షలమంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేయించుకొన్నారు. ప్రతి సంవత్సరం 4 లక్షలమంది అదనంగా చేరుతున్నారు. ఇలా దేశవ్యాప్తంగా ఎంతమంది నిరుద్యోగులు ఉన్నారు? వారికొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఎన్ని ఉద్యోగాలు మంజూరు అవుతున్నాయి? ఎందరు నియామకం జరుగుతున్నారు? అధికారం లోనికి వచ్చిన జనతాదళ్ ప్రభుత్వంగాని, మన రాష్ట్రంలోని చెన్నారెడ్డి ప్రభుత్వంగాని ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలను మంజూరు చేసిందనే విషయాల్ని ఎవరూ గమనించడంలేదు. పాలకులు మనలను ఎలా భ్రమలకు గురిచేస్తూ "చేటలో తౌడుపోసి కుక్కలను ఉసిగొల్పినట్లు"గా మనలను తమ రాజకీయలబ్ధికై వినియోగించుకొంటున్నారో అందరమూ గమనించవలసిన అంశం.

ఆరుగాలం పనిచేసే ప్రజానీకం తమ ఫలితాన్ని పొందలేక నిరుపేదలుగా జీవిస్తున్నారు. శ్రమతెలియని పాలకవర్గాలు హాయిగా సేదతీరుస్తూ సంపదనంతా ఆక్రమించి విలాసజీవితం గడుపుతున్నారు. శ్రమజీవులకు ఫలితాన్ని దక్కకుండాచేసింది ఎవరు? ఈ అగ్రవర్ణాలుకావా? సామాజికంగా వెలివేసి, జీవనాధారంలేని నిరుపేదలుగా మార్చింది ఎవరు? ఈ అగ్రవర్ణాలు కావా? జాతి సంపదనంతా గుప్పిట్లో పెట్టుకొంది ఎవరు? ఈ పాలకవర్గాలు కావా? వెనుకబడిన వర్గాలలో, నిమ్నజాతులలో ఎక్కడో ఒకరు ఆర్థికస్థాయి కలిగివుంటే ఉండవచ్చుగాని అతని సాంఘికస్థాయి సమాజంలో ఇంకా వెనుక

బాటుగానే ఉందనేది నిజంకాదా? తరతరాలుగా అణచబడివున్న వర్గాలు ఉప్పెనై లేచే ప్రమాదాన్ని పసిగట్టి పాలకులు ఈ రిజర్వేషన్‌లను రాయితీలుగా ప్రకటిస్తున్నారు. దీన్ని ఒకరు ఇచ్చేదికాదు. అది వారి జీవితహక్కు. అవునన్నా కాదన్నా వారి శ్రమఫలితాలు వారికి పూర్తిగా చెందాల్సిందే. దీన్ని అందరూ ఆమోదించాల్సిందే.

లక్షలకు లక్షలు క్యాపిటేషన్ ఫీజులు చెల్లించి కొనుక్కునే "ప్రతిభ" కాన్వెంటు పాఠశాలలో నెలకు వందలకొద్ది ఫీజులుచెల్లించి సంపాదించే'ప్రతిభ' సీలింగ్‌ఫ్యాన్, ఎయిర్‌కూలర్ల సమక్షంలో ఉత్పన్నమయ్యే 'ప్రతిభ', మారుతీ కార్ల కుషన్‌సీట్లలో విద్యాలయాలకువెళ్ళే 'ప్రతిభ' సామాన్యమానవుని దగ్గర కెలావస్తుంది? సామాన్యుని దగ్గర శ్రమచేసే ప్రతిభవుంది. ఉత్పత్తిచేసే ప్రతిభవుంది. అయితే ఏం? ఫలితం లేదు. ఇప్పటివరకు జరిగిన నియామ కాలలో ఎన్ని "ప్రతిభ"లకు ఉద్యోగాలు వచ్చినాయి? కేవలం ధనం, రాజ కీయ ప్రతిభ గలవారికే ఉద్యోగాలు చెందుతున్నాయనేది వాస్తవంకాదా? ప్రతి భకే పట్టంకట్టాలంటే దానిని సార్వత్రికమైన నినాదంగా మార్చాలి. ఎవరి ప్రతిభకు అనువైన పనిని వారికి అందించాలి. వ్యవసాయం చేసేందుకు ఎవరికి ప్రతిభవుంటుందో వారికి భూమి చెందాలి. అంటే దున్నేవానికే భూమి కావాలి. పారిశ్రామిక రంగంలో ఎవరికి ప్రతిభవుంటుందో వారికే పరిశ్రమలు చెందాలి. శ్రమచేసే ప్రతిభ ఎవరికుంటుందో వారికే ఫలితం దక్కాలి. అంతేగాని ధనబలంతో కొనుక్కొనే ప్రతిభ ఈ సమాజంలోని పీడితవర్గాన్ని ఇంకా పీడించడానికే ప్రయత్నిస్తుంది. అందుకే మనందరం ఉమ్మడిగా అంద రికి చదువు, అందరికి ఉద్యోగం అని నినదించాలి. పనిహక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించి ఎవరి ప్రతిభకు తగిన పనిని వారికి అందించాలనే డిమాండును తేవాలి. అంతేగాని ఇన్నాళ్ళనుండి సమాజంలో అన్యాయానికి గురౌతూ అణచబడిన వర్గాలకు కలిగే అవకాశాలను వ్యతిరేకించడం పాలకుల స్వార్థపూరిత, రాజకీయ అవకాశవాద ఊబిలో కూరుకుపోవడమే తప్ప మరొ కటికాదు.

ఈనాటి ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిష్కరించే స్థితిలోలేవు. గొంతువరకు సమస్యల ఊబిలో కూరుకుపోయినవి. తమ ఉనికిని కాపాడు కొనేందుకే నానాయాతనలు పడుతున్నాయి. కాశ్మీరు, పంజాబ్, అస్సాంలాంటి జాతి పోరాటాలు, ఈశాన్య భారతం, ఆంధ్రప్రదేశ్, బీహార్‌లాంటి విముక్తి

సాధించుకుంటాం! నిలుపుకుంటాం!

— జి. రవీందర్

ఏ.సి. రూముల్లో కూర్చొని
పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటు
మెలికలు తిరిగే మీ చేతులు
రోడ్లను ఊడుస్తూ
శుభ్రం చేస్తూంటే
రైల్వే స్టేషన్‌లలో
బస్‌స్టేషన్‌లలో
బస్తాలు మోస్తూంటే
వచ్చేపోయే వాహనాలను
శుభ్రంగా తుడుస్తూంటే
మమ్మల్ని అవమానపరచిన
మీ చేతులకు
నిజమైన ప్రతిభ అంటే ఏమిటో
తెలుస్తుంది... ప్రొసీడ్!
రాష్ట్ర రాజధానులలో
దేశ రాజధానిలో
విచ్ఛిన్నకర దుశ్చర్యలకు పాల్పడుతూ
అరాచకాలు యథేచ్ఛగా సాగిస్తున్న

పోరాటాలు పాలకుల గుండెల్లో ఫిరంగులను ప్రయోగిస్తున్నాయి. పాలకులు దిక్కుతోచని స్థితిలో ఈ నేలను నెత్తురులో ముంచుతున్నారు. యుద్ధబూచిని చూపి భయపెడుతున్నారు రిజర్వేషన్ల పేరుతో వైషమ్యాలను సృష్టిస్తున్నారు. దీంతో ప్రజలదృష్టి ప్రక్కదారి పడుతోందనే అభిప్రాయం వారికుంది. అందుకే పది సంవత్సరాల తర్వాత మండల్ కమీషన్ తన బూజు దులుపుకొని బయటికి రాగలిగింది.

ఈ విషయంలో స్పష్టమైన అవగాహన లేకపోవడంవల్లనే విద్యార్థులు తమ ఉద్యమాలను ప్రక్కదారి పట్టిస్తున్నారు. భూస్వామ్య వర్గాలు ఈ ఉద్యమాలలో చొరబడి తమ నాయకత్వాన్ని సృష్టించుకో గలుగుతున్నాయి. విద్యార్థినాయకులను ప్రలోభాలకుగురిచేసి శాశ్వతంగా తమ ఏజెంట్లుగా చేసుకో గలుగుతున్నారు. అందువలన సాహసోపేతమైన పోరాటం సాగిస్తున్న విద్యార్థులు, యువకులు, మధ్యతరగతి ప్రజానీకం దేశమంతటా కొనసాగుతున్న రైతాంగపోరాటాలలో సమైక్యంకావాలి. వ్యవసాయ విప్లవంతో జాతుల అభ్యున్నతికి జరిగే పోరాటంలో సంలీనంకావాలి. జనతా ప్రజాతంత్ర ప్రభుత్వ సంస్థాపనకు నడుం బిగించి పోరాటానికి ఉపక్రమించాలి. అప్పుడే మన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. లేకపోతే "గొంగట్లో కూర్చొని వెంట్రుక లేరిన" చందంగానే ఉంటుంది.

అగ్రకుల దురహంకారులు
ఖాకీవనం నేత్రాలకు కనిపిస్తలేవు
నోట్లకట్టలతో మూసివేయబడ్డాయి!
పండిన పంటలకు
గిట్టుబాటు ధరలు కావాలని
పవర్ సప్లయి జరగాలని
పనిహక్కు కల్పించాలని
ఊరేగింపులు
రాస్తారోకోలు నిర్వహిస్తే
ఖాకీవనం లాఠీలు, తూటాలు
జనస్రవంతిపై నాట్యంచేస్తాయి!
దాదర్ ఎక్స్‌ప్రెస్‌లో
అత్యాచారానికి గురైన అతివలకు
న్యాయం జరగాలని
నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తే
లాఠీ "చార్జ్" అవుతుంది
144 సెక్షన్ నిలబడుతుంది
తపాకులు తూటాలు కక్కుతాయి
ప్రతిభ పరాభవాన్ని ఊహించుకొని
భరించలేని పరాన్నభుక్కులు
ఆత్మహత్యకి దిగారు
ఎంత ఘోరం!
ఎంత అక్కసు!!
ప్రతిభ! ప్రతిభ! ప్రతిభ!
నలిగిపోతున్నావటగా !?

నాగలిపట్టిన చేతుల్లో
చెప్పులుకుట్టే చేతుల్లో
కుండలుచేసే చేతుల్లో
బట్టలు ఉతికే చేతుల్లో
యంత్రాలు నడిపే చేతుల్లో
ఆయుధాలుచేసే చేతుల్లో
అప్రతిష్ఠకు గురవుతున్నావా!
ఒరే!
మీ రాజకీయ చదరంగ
చక్రవ్యూహంలో
ప్రశ్నించే మానవ చరిత్ర
మీ ఆధిపత్యాన్ని ఎదిరించే
చైతన్యాన్ని పెంచుతుంది
అగ్రవర్ణాల అలజడికి జడిసి
నామమాత్ర రాజ్యాంగానికి
'సవరణ'ల తూట్లు పడవచ్చుగాక
తరతరాలుగా మీరు రిజర్వుచేసుకున్న
సమాజ సాంస్కృతిక
భౌతిక సంపద సాధనకై
అభాగ్యులమంతా ఆయుధాలమవుతాం
రిజర్వేషన్‌లు
మీరిచ్చే రాయితీలు కావు
పోరాడి సాధించుకొనే హక్కులు
పోరాడి సాధించుకొంటాం!
నిలుపుకుంటాం!

సమీక్షలు

వసంత పవనం

– కె. వి. ఆర్.

"బతుకు తరుముకత్తంది- గాలిదుమారం పెద్దదైతంచి- ఊళ్ళకుదుర్లు కదిలిపోయినయి. అడవి అడవంతా ఊగుతోంది. గాలిదుమారం దండకారణ్యంల సుళ్ళుతిరుగుతంది. కామ్రేడ్స్- నాగలిపట్టిన రైతుల సేతుల్లకు రైఫిలొచ్చింది. అంతిమవిజయం మనదే"".

గెరిల్లాదళానికి సరికొత్తగా కమాండరైన భీమన్న తన సహచరులను ఉద్దేశించి చెప్పిన మాటలివి. భీమన్న కవికాదు. అయినా ఈ మాటల్లో కవిత్వం ఉంది. వర్ణనలు ఉన్నంత మాత్రాన్నే ఇది కవిత్వంగా మారలేదు. దశలవారిగా మెట్టుమెట్టుగానే అయినా, ఒక దొడ్డకల వాస్తవాతివాస్తవంగా రూపొందుతూవుంది. ఆర్థికపీడన మూలంగా జీవితంలో అతి ముఖ్యమైన స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతోపాటుగా సుస్థితికీ, సంతృప్తికి, అన్నిటినీమించి మానవ గౌరవానికి దూరమైన కోట్లాదిమంది దేశప్రజలకు విముక్తిని కలిగించేందుకు రెండు దశాబ్దాలుగా మును సాగిపోతూన్న విప్లవోద్యమం మహత్తరమైన స్వప్నం లాంటిది. సమాజం ముందంజవేసే ప్రతిమారూ ఇలాంటి కలకు అవసరం ఏర్పడుతుంది. కలగనడం మామూలుగానైతే సులువే. కాని, చారిత్రక పురోగమనానికి సంబంధించి కలగనడం సాధారణ విషయంకాదు. మరి, అలాంటి కలను నిజంచెయ్యడం మాటలతో జరిగేదికాదు.

భీమన్న పలికిన ఈ ఐదారు వాక్యాల మాటలు ఉత్తుత్తివికావు. ప్రతి మాట వెనుకా ఎంతో కథవుంది - కష్టనష్టాలతో నిండిన సాదాబతుకుల్లో ప్రభుత్వ యంత్రాగము, భూస్వాములు, వ్యాపారులు వెదజల్లుతున్న పచ్చి నిప్పుల్లోంచి, కుమ్మరిస్తున్న బూడిద బుగ్గిలోంచి, సంఘటిత పశుత్వానికి అనుదిన సాక్ష్యం సమకూరుస్తున్న పోలీసుల విశృంఖల క్రౌర్యంలోంచి, భూమిభుక్తిలేక దినదినగండంగా చస్తూబతుకుతూవున్న గిరిజన, గిరిజనేతర పేద రైతాంగం అనుభవిస్తూన్న పేదరికంలోంచి ఒక పెనుమంట గాలితో కలిసి వెలువడుతోంది. విలువైన నెత్తురు అడుగడుగునా మడుగుకడుతూ, నిజంగానే తృణప్రాయంగా ప్రాణాలను అర్పిస్తూ, ఎప్పటికప్పుడు ఉత్సాహం రెట్టింపు చేసుకుంటూ, "అంతిమ విజయం మనదే"నన్న చారిత్రక ఆశావహదృష్టితోటి

ఒకవైపున ఆత్మరక్షణ చేసుకుంటూ, అదేసమయంలో మరొకవైపున తన కార్యక్షేత్రాన్ని విస్తరించుకొంటున్న గెరిల్లాదళం, కోట్లాదిమంది ప్రజల గుండెమంటకూ జీవితాశకూ ప్రత్యక్షరూపం. దాని ఊపిరే "వసంత గీతం".

అలాంటి అనేక దళాలలో ఒక- 'ఒకానొక' కాదు- దళం పోరాటానుభవాల సంపుటి, పులి ఆనందమోహన్ చేతిలో ఇప్పుడు నవలారూపం తీసుకొంది. అల్లం రాజయ్య, బి.యస్. రాములు వంటి వి.ర.సం. సభ్యులు తమ కథలద్వారా పోరాటప్రాంతంలో వివిధ సామాజిక అంతస్తులకు చెందిన మనుషుల జీవితాలను అనేక కోణాలనుంచి చిత్రించడం జరిగింది. 'సృజన', 'అరుణతార' పత్రికలలో మారుపేర్లతోనో అనామధేయంగానో కొందరు రచయితలు ప్రజా గెరిల్లాదళాల అనుభవాలను కథలుగా మార్చివున్నారుకూడా. అవి ఎక్కువగా శకలాలలాంటివి. వాటికి విరివిగా విప్పు లేవు. ఉన్నంతలో సాధ్యమైనమేరకే, దళజీవితానికి సమగ్రమైన రూపం ఇచ్చేందుకు ఈ నవల ఫలవంతంగా ప్రయత్నించింది. వర్ణించవలసివస్తే, ఇది వసంత పవనమే.

ప్రచురణకర్తలు రాసినట్టుగా, "అభూత కల్పనలతో" ఊహాలోకాల్లో విహరిస్తూన్న నేటి తెలుగు నవలలకంటే 'వసంతగీతం' మౌలికంగానే భిన్నమైంది. యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకటకృష్ణమూర్తి, మరెందరో మహానుభావులుచేరి తెలుగు నవలను అక్షరాలా బజారుసరుకు- లాభసాటిదే!-గా మార్చారు. నవలను సినిమా వాడుకొంటూవుందో, సినిమాను నవల వాడుకొంటూవుందోగాని, వెరసి ఈ రెండూ సాహిత్యాన్ని, కళను దిగజార్చివేస్తున్నై. వాటివిషయం అటుంచిచూస్తేకూడా, నవలలు, కథలు ఒక తల్లికి ఒక తండ్రికి పుట్టిన బిడ్డలనిపించకుండా, వాస్తవజీవితం తాలూకు మొక్కల్లే కనిపించనివిధంగా తయారయ్యాయి. వర్గచైతన్యం మాటెందుకు, పు. సు. శర్మ, ఇం. శ్రీ. శర్మలాంటి మహనీయులు తరచు ఆరోపించే 'సామాజిక స్పృహ'కూడ కనిపించకుండా, తెలుగు 'కల్పనాసాహిత్యం' (ఫిక్షన్) కల్పనను మాత్రమే ఆశ్రయించి, సాహిత్యస్థాయికి ఎడమైపోయి వుంది. ఇలాంటి స్థితిలో 'మాలపల్లి', 'చదువు', 'అల్పజీవి' లాంటి విశిష్టమైన రచనలను ఆశించడం నిజంగానే పేరాశ. వృత్తిరీత్యా నవలారచయిత కాకపోయినా, తనదైన శైలిగురించి తనకే సందేహాలేవో ఉన్నా, ఎందరోకొందరు మిత్రులు చూచి, చదివి చేసిన సూచనలను తీసుకొని తన రచనలకు జతచేసుకున్నా, ఆనందమోహన్ ప్రథమ ప్రయత్నంలోనే రచయితగా తన సత్తాను రుజువు

చేసుకోగలిగాడు. సాధించి చూపినదానికంటె ఎన్నోరెట్లు ఎక్కువగా పెరిగే సూచనలు స్పష్టంగానే పాఠకులకు కనిపిస్తున్నాయి. కావలసిందొక ఉప-సాధన.

'సామాజిక' నవలకూ 'చారిత్రక' నవలకూ మధ్యగల భేదాలగురించి వెనకటికి రాచమల్లు రామచంద్రారెడ్డి ఒక వ్యాసంలో వివరించి పోయారు. విశిష్టమైన దేశకాల పరిస్థితులను నిర్దిష్టంగా చిత్రిస్తూ, చారిత్రక శక్తులకు, సామాజిక ధర్మాలకు ప్రాతినిధ్యం వహించేలాగ పాత్రలను రూపొందించి, అనివార్యమైన చారిత్రక ఘర్షణను వ్యక్తిమాత్రులైన పాత్రల ఘర్షణలుగా రూపించడం అవసరమని అన్నారు. ఇదిమాత్రమే చాలదనికూడా రాశారు. "చారిత్రక నవల చారిత్రకంగా ఉంటూనే నవలా లక్షణాలను అణుమాత్రం కూడా కోల్పోకూడదు". చారిత్రక పరిణామక్రమంలోని వివిధ ఘటనలను విపులంగా చిత్రించడంగాని, నాటి పూర్వాపరాలను విస్తృతంగా పరిశీలించడం గాని, చారిత్రక నవల కర్తవ్యం కాదు. "సారభూతమైన" (Essential) ఘటనలకు మాత్రమే నవలలో స్థానముంటుంది. "క్లుప్తీకరణ"(Condensation) "సాంద్రీకరణ" (Concentration) పొందిన చారిత్రక క్రమాన్ని అతిముఖ్యమైన, సార్థక్యం కలిగిన, నమూనా (Typical) అవదగిన ఘటనల రూపాన చెప్పడంతోటి, చరిత్రకు నాటక స్వభావం సమకూరుతుంది. "కళాత్మకత"ను ఆయన నొక్కిచెప్పారు వ్యక్తుల కష్టసుఖాలకు, రాగద్వేషాలకు, హృదయానుభూతులకు ప్రాముఖ్యం ఇస్తూ, ఘటనాక్రమం ఫలితంగా మనుషులు ఎలా ఎలా వివిధ అనుభూతులకు లోనవుతున్నదీ వివరించినప్పుడే రచనకు సాహిత్యగుణం చేకూరుతుంది. ఈ కొలబద్దతో కొలిచినప్పటికీ, 'వసంతగీతం' మంచి చారిత్రక నవల అనిపించుకోగలదు. 'మంచి' అంటే 'మాంఛి', 'ఉత్తమోత్తమమైన' అనిమాత్రం అర్థంకాదు. ఇలాంటి నవలలతో పోల్చిచూచినప్పుడు, వాటికంటె ఇది మెరుగైందని నిశ్చయంగానే చెప్పవచ్చు.

'చారిత్రక' నవలలన్న పేరు పెట్టుకోకపోయినా, సమకాలిక చరిత్రనే చిత్రించబూనిన రచనలు కొన్ని వచ్చివున్నాయి. చరిత్రను కల్పనా కథగా మార్చి, అంటే చరిత్రనే పరిమార్చిన నవలల విషయం ఇక్కడ ప్రస్తావించదంలేదు నోరి నరసింహశాస్త్రినీ, అడివి బాపిరాజునీ, పిలకా గణపతిశాస్త్రినీ, చివరకు ముదిగొండ శివప్రసాద్‌నూ పేర్కొడంలేదు 'ఆంధ్రప్రచారిణీ గ్రంథమాల' వారి నవలల ఊసెత్తడంలేదు. అలాంటప్పుడు, విశ్వనాధ

సత్యనారాయణ సోదెలోకిగూడా రాడు. ఆ నవలలన్నీ వాస్తవచరిత్రనుగాక, చారిత్రక కల్పనను (Historical Romance) ఆశ్రయించిన రచనలు. అవి సుమార గతానికి చెందినవి 'చారిత్రక' నవలకూడా గతానికే సంబంధించిందే గాని, సమీపగతానికీ, ఇప్పుడిప్పుడే గతంగా మార్పుచెందుతూన్న వర్తమాన కాలానికీ సంబంధించింది. ఇలా చూసినప్పుడు, వాసిరెడ్డి సీతాదేవిగారి 'మరీచిక', పవనినిర్మల ప్రభావతిగారి 'రాక్షసీ! నీ పేరు రాజకీయమా?' వంటి నవలలు, ఆ రచయితల ఉద్దేశం ఏదైనప్పటికీ, చారిత్రకాలే. సమకాలిక రాజకీయంలో 'నగ్జలైట్' ఉద్యమం ఒక ప్రబలమైన శక్తికదా, దాన్ని ఈ రచయిత్రులు ఎలా చిత్రించారు? దీన్ని వక్రీకరించి చూపారు. వారివారి వ్యక్తిగత రాజకీయ అభిప్రాయాలతో అభిమానాలతో నిమిత్తం లేకుండా, కేవలం వస్తుగాతంగానే చూసినప్పటికీ, ప్రముఖమైన ఒక సామాజిక వాస్తవాన్ని ఉన్నదాన్ని ఉన్నట్టుగా గ్రహించడంలో వాళ్ళు విఫలమయ్యారని చెప్పవచ్చు. తమ స్వకీయ అభిమాన దురభిమానాలకు సామాజిక వాస్తవ చిత్రణను బలిపెట్టి, తమ సాహిత్యానికి తామే అపచారం చేసుకొన్నారు. 'చారిత్రక' నవలారచనలో అరితేరి, రా.రా. ప్రశంసగూడా చూరగొన్న మహీధర రామమోహనరావుగారి నవలల్లోనైతే, ఈ వక్రీకరణ పరాకాష్ఠ పొందింది. మతితప్పిన ఒక యువకుడి పాత్రను నగ్జలైట్ ఉద్యమానికి ప్రతినిధిగా నిలిపారంటే అర్థంచేసుకోవచ్చునేమోగాని, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీనుండి చీలిపోయి వేరే కుండ పెట్టుకున్న 'మార్క్సిస్టు' పార్టీవాళ్ళను సైతం తన సాహిత్య రచనలలో ఆయన క్షమించలేదు. సరిగదా, వికృతీకరణను కార్టూన్ కళాస్థాయికి దించి- పోసీ పెంచి- పాత్రలకు బదులుగా వ్యంగ్య చిత్రాలను (Caricatures) కొలువు పెట్టారు. వీరి సాహిత్యంలో లోపించింది, రచనకు ఏది ఉప్పులాంటిదో ఆ సత్యవిధేయత, జీవిత వాస్తవయథార్థత (Authenticity). ఆనందమోహన్ రచనలో ఎన్ని లోపాలైనా ఉండవచ్చుగాని, వాటన్నిటినీ కమ్మివేయగల సుగుణం ఇదే. తాను నవిమర్శకంగా పరిశీలించిన జీవితతలాన్ని తన రచనలో ఒక కళాకారుడు ఎంత విశ్వసనీయంగా యథామాతృకంగా చిత్రించగలిగాడన్నది మాత్రమే, ఆ రచయిత చిత్తశుద్ధికి (Sincerity) ఏకైక నిదర్శనం. కాబట్టి 'చారిత్రక' నవలకు ఉండవలసిన మౌలిక లక్షణం [రా. రా. పేర్కొన్నది కాదు] ఈ Artistic Sincerity) సృజనాత్మక రచయితకు ఇది పెన్నిధి. అతని సాహిత్య ఉత్కృష్టతకు గీటురాయి ఇదే.

"పత్రికలూ, సినిమాలూ, అభూత కాల్పనికులూ కలిసి ఈ సాయుధ పోరాటం గురించీ, నక్సలైట్లుగా పిలువబడే విప్లవకారుల గురించీ జనముందు వొక తప్పుడు చిత్రాన్ని నిలుపుతున్నారు", అంటూ 'గోదావరి ప్రచురణలు' పక్షాన రాశారు. నిజమే. ఈ "తప్పుడు చిత్రం" వారి పక్ష ప్రయోజనాలకు ఒక అవసరం. తప్పుడుతనం ఒక ముఖ్యమైన ప్రచారాయుధం. వాస్తవ పరిజ్ఞానం లోపించడంతోపాటు, దుర్బుద్ధికూడా ఇందుకు కారణం. పనిగట్టుకొని పోలీసులే విప్లవోద్యమ వ్యతిరేక 'సాంస్కృతిక' కార్యకలాపాలకు దిగుతున్నారు గదా, మరి ఒక ఉషాకిరణ్ మూవీస్ ['పీపుల్స్ ఎన్‌కౌంటర్']గానీ 'అడవి దివిటీలు' చిత్ర నిర్మాతలుగానీ, ఊరుకుంటారా? మనం ఇక్కడ చూడవలసింది అదికాదు. ఉద్యమం గురించీ పోరాటం గురించీ దళంగురించీ ఉద్యమాభిమానులైన జనం గురించీ వ్యతిరేకుల గురించీ ఈ నవల ఎంతవరకు వాస్తవ విహితంగా ఉన్నదన్న విషయమే ముఖ్యం. ఉద్యమాన్ని ఆదర్శీకరించి చూపడం జరిగిందా? నిజం-ముఖాన వెల్లవెయ్యడం జరిగిందా? లేక ఉన్నవి ఉన్నట్టుగా లోపసహితంగా సుగుణాలను నిరూపింపడం జరిగిందా? ఉద్యమాభిమానులైనా సరే, సాధారణ పాఠకులకు మాత్రమేగాక, విషయజ్ఞుల మనుకొనే కొద్దిమందికిగూడా, ఉద్యమానికేవైనా "లోగట్లు" లాంటివి వుంటే, అవి తెలిసే అవకాశాలు తక్కువ. ఇది ప్రధానంగా రహస్య ఉద్యమం కావడమే దీనికి కారణం. ఆనందమోహన్‌కైనా ఇలాంటి లోటుపాట్లు ఏ మేరకు తెలిసివుంటాయో చెప్పడానికి వీలులేదు. ఉద్యమ నాయకత్వం పట్నవాసాలలో విలాసవంతమైన జీవితం గడుపుతూ ఉందనీ, దళ కమాండర్ లచ్చన్న "డెన్"లో లక్ష రూపాయలు దొరికాయనీ, ఇలాంటి మాటలేవో పోలీసులు ప్రచారంచేశారని నవలలో ఒకటి రెండు ప్రస్తావనలు వచ్చాయి తప్పితే, దళసభ్యుల పరస్పర సంబంధాలుగానీ, జనంతోటి దళం సంబంధాలుగానీ, దళసభ్యుల వ్యక్తిగత ప్రవర్తనా విశేషాలు గానీ, లోపరహితంగానే చిత్రించబడ్డాయి. వాస్తవం ఇంత ఉదాత్తంగానే ఉంటుందా? ఉండనప్పుడు, వాస్తవానికి విధేయుడైన రచయిత ఇలాంటి నెరసులనుకూడా చూపించివుండవలసిందికాదా? ఈ ప్రశ్నలు రాకమానవు. అట్లని, తాను చిత్రించబూనిన జీవితవాస్తవ శకలంపట్ల రచయితకు అభిమానం ఉండగూడదనిగానీ, ఎంతటి రచయిత అయినాసరే పూర్తి నిర్మమంగా తటస్థుడిలాగా, కేవలసాక్షిగా రాస్తాడనిగానీ అర్థంకాదు. నూటికి నూరుపాళ్ళు వస్తుపరత్వం (Objectivity) అసాధ్యం. ఆనందమోహన్‌కు ఉద్యమ ఆదర్శంపట్ల గౌరవం, ఆచరణపట్ల

ఆమోదభావం పుష్కలంగా వున్నాయి. ప్రతి విప్లవ రచయితకు ఇవి తప్పనిసరి.

కళల్లో, ముఖ్యంగా సాహిత్యంలో, అందులోనూ కథ, నవలలాంటి వచన రూపాల్లో, వాస్తవికతావాదాన్ని పాటించే రచయితలు మరీ మరీ గుర్తుంచుకోవలసిన విషయం కాబట్టి ఇంతగా రాయవలసి వస్తున్నదిగాని, దోషైక నిరూపణబుద్ధితో, లేనిలోపాలను చూపమనిగానీ, లవలేశంగామాత్రమే ఉన్నలోపాలకు భూతద్దంపట్టి చూపమనిగానీ కోరడంలేదు. "సోషలిస్టు వాస్తవికతా వాదం" పేరున సోవియట్ రచయితలు ఒకప్పుడు ఉద్యమ నాయకులనుగానీ పార్టీ కార్యకర్తలనుగానీ పాత్రలుగా చిత్రించేపట్టున, సకల సద్గుణోపేతులన్నట్లుగా Positive పాత్రలను మాత్రమే సృష్టించారనీ, అవి దేవతా ప్రతిమల్లాగానో, మైనపు బొమ్మల్లాగానో రూపొందాయి తప్ప, వాస్తవ మానవ ప్రతిరూపాలుగా రూపొందలేదనీ ప్రబలమైనవిమర్శ ఉంటూవచ్చింది. ఇది వాస్తవికతావాదానికే అపచారం. ఆమాటకువస్తే, నేటి విప్లవపార్టీలలో నాకు తెలిసిన సి పి ఐ. (యం.యల్.) పీపుల్స్‌వార్ పార్టీ కొంతకాలం కిందట పార్టీలో కనిపిస్తూవచ్చిన కొన్ని వ్యసనాలకు (Evils) వ్యతిరేకంగా 'దిద్దుబాటు' (Rectification) కార్యక్రమాన్ని చేపట్టవలసివచ్చింది. ఈ నవలలో ఎక్కడా పేర్కొనకపోయినా, ప్రధానంగా కనిపించే 'దళం' పీపుల్స్‌వార్ పార్టీకి చెందిందేనని ఊహించడం కష్టంకాదు. మరి, ఆ దళ సభ్యులు యావన్మందీ పురుషోత్తములేనా? వాళ్ళు లోపరహితులా? లోపాలేవయినా ఉన్నాయనుకొంటే వాటినిచూపి, కనీసం సూచించి, అలాంటివాటిని నిర్మూలించే ప్రయత్నాన్నీ దాని సాఫల్యాన్నీ జోడించి చూపడం, అటు ఉద్యమ వాస్తవానికీ విహితంగా ఉంటుంది, ఇటు పాత్రల వాస్తవికతకూ తోడుపడుతుంది. ఉద్యమం మరింత తేటపడడానికీ అంతిమంగా ఇది ఉపకరిస్తుంది. ఈ నవలకు లోపాలేవయినావుంటే, వాటిలో ఇది ఒకటి.

విప్లవోద్యమంపట్ల ఎంతో కొంత సానుభూతివున్న ఒక సాహిత్య విమర్శకుడు ఇటీవల నాతో మాట్లాడుతూ, పత్రికల ప్రచారంవల్లనూ ప్రభుత్వ ప్రచారంవల్లనూ ఉద్యమ గతిపట్ల, కొత్తకొత్త పోరాట రూపాలపట్ల, తనకు క్రమేపీ పెరుగుతున్న అసంతృప్తిని వెల్లడించడం జరిగింది. గోండులలాంటి ఏ గిరిజనుల జీవితాలకు వెలుగు తెచ్చేందుకు తాము ఉద్యమించారో, ఆ గిరిజనుల జీవితవిధానంలో సాంప్రదాయకంగా కొనసాగుతున్న

బహుభార్యాత్వం, తాగుడు వగైరా చెడుగులను నిర్మూలించేందుకు ప్రయత్నించకుండా, ఉద్యమ కార్యకర్తలు వాటితో రాజీపడుతున్నట్టు, కొనసాగనిస్తున్నట్లు వెలువడుతున్న వార్తలను ఆయన నమ్ముతున్నారు. సారాయి ధర తగ్గించడానికి ప్రయత్నాలు ఒకవైపున సాగుతూంటే, మరోవైపున గిరిజనస్త్రీలు తమ భర్తలను తాగుడు వ్యసనంనుంచి బయటపడవేసేందుకు సమీకృతులయ్యారన్న వాస్తవ ఘటనలకు బూర్జువా పత్రికలు ప్రాముఖ్యం ఇవ్వడంలేదు. 'వెనకబడిన చైతన్యం' ధరించే అనేక వికృతరూపాల విషయంలో ఉద్యమ కార్యకర్తలు సంకల్పపూర్వకంగానే జాగ్రత్త వహిస్తూనే ఉన్నారని కూడా మనకు తెలుసు. ఈ నవలలోకూడా "దేవేరుల" విషయంలో గిరిజనులకుగల మూఢవిశ్వాసాల గురించీ, పెళ్ళివంటి విషయాలలో దుబారాఖర్చు గురించీ, ఒకటి రెండుచోట్ల ప్రస్తావనలయితే ఉన్నాయిగాని, ఘటనల రూపంలో వాటిని పాత్రలపరంగా చిత్రించివుంటే, ఎంతో బాగుండేది. సాంఘిక చైతన్యం విషయంలో వెనకబడివున్న గోండు స్త్రీలను దళంసభలకు తరలించడంలో రాధక్క చూపిన చొరవ ఇలాంటి ఘటనల్లో ఒకటి. అయితే 'చారిత్రక' నవలలో అత్యంత సార్థకమైన ఘటనల చిత్రీకరణే సాధ్యమవుతుంది అట్లని, అల్పఘటనలే లేకుండా వుండవు. నవలకు నిండుదనాన్ని సమకూర్చేవి ముఖ్యఘటనలు మాత్రమే కాదు. స్వల్పాంశాలు (Details) మినహాయిస్తే, మనకు మిగిలేది అస్థిపంజరమో - రేఖాచిత్రమో మాత్రమే.

చివరగా, కథాస్థలం విషయంలోవున్న, ఉండవలసిన నిర్దిష్టతకు రూపురేఖలు సమకూరేది, Nativity అని తప్పుగా మనం పిలుస్తూన్న Local colouring మూలంగానే, ఈ నవలలో కథాస్థలంగా ఉన్నప్రాంతం విశేషాలు అడవులూ కొండలూ గూడలూ పాములూ పులులూ తేళ్ళూ మాత్రమేనా? మిగిలిన ప్రాంతాలకంటె భిన్నమైనదని చూపించే జంతువులూ, చెట్లూ, విశిష్టంగా ఏవీ ఉండవా? కథాగమనక్రమం దెబ్బతినకుండానే ప్రస్తావవశంగానైనా ఇలాంటివాటిని అవసరాన్నిబట్టి పేర్కొనడంవల్ల, మరింత విశ్వసనీయత కలుగుతుంది.

→

2

స్థలం—

రాష్ట్రం వాయవ్యప్రాంతంలో చిట్టచివర ఆదిలాబాదు జిల్లా. అందం లోనూ, గోదావరికి పడమట, మహారాష్ట్రాన్ని చెయిచాచి అందుకొనేంత దాపు. అడవుల్లో, కొండల్లో, అడవులనగానే పూర్తి నిర్మానుష్యమైనవని, కొమ్ములు తిరిగి బిరుదులు ధరించివున్న మన మేటి రచయితల్లో- కరీంనగర్ జిల్లాలో పుట్టినవాళ్ళలోనూ- ఒక అభిప్రాయం ఉంది వీళ్ళు "తల్లి మొగము నెరుంగని తనయులు". నిజానికి, ఈ కథావ్యక్తులు సంచరించే ప్రాంతం, గోందు గూడేలతోటీ తదితర గ్రామాలతోటీ చిక్కటిల్లే ప్రాంతం లింగన్న, రాధక్క, బొజ్జులాంటి గెరిల్లాదళ సభ్యులు కొందరు ఇక్కడివాళ్ళే కాకుంటే, దళం ఈ గూడేలలోనూ గ్రామాలలోనూ స్థిరనివాసం ఏర్పాటుచేసుకోదు. చేసు కుంటే అది గెరిల్లాదళం కాలేదు. ఎందుకంటే, చచ్చీచెడిఅయినా, శత్రువు తరచుగానే ఇక్కడికి చొరబారి రాగలుగుతున్నాడు కొన్నిచోట్లనయితే, పోలీసు కేంపులుగా మొదలై ఠాణాలుగా ముదిరిన సందర్భాలు ఉన్నాయి. అంచేత దళం ఈ పల్లెలకు చుట్టపుచూపు తరహాగా వచ్చిపోతుంది తప్ప, ఆత్మరక్షణ కోసం అడవులనూ కొండలనూ ఆశ్రయిస్తుంది. కృష్ణలాంటి కొరియర్లనటుంచి, గోందు దాదాలనూ నిరుపేద రైతాంగాన్నీ పాలేర్లనూ సమాచార సాధనాలుగా, రహస్య సమావేశ నిర్వాహకులుగా, శ్రోతలుగా, అన్నిటికీమించి సమ్మెల్లాంటి పోరాటాలలో ఉత్సాహంగా పాల్గొనే చైతన్య వంతులైన ప్రజలుగా ఎంచుతుంది: నమ్మికనిచ్చి నడుపుతుంది; మమేకం పొందుతుంది. అందుచేతనే ఇది పోరాటప్రాంతంగా రాటుదేలిన స్థలం కాగలిగింది.

కాలం—

స్థూలంగా, 1980 తర్వాత, 1986 ముందు ప్రత్యేకించవలెనంటే, తెలుగుదేశం పార్టీ అధికారంలోకివచ్చి, (1983) అంతర్గత కుట్రఫలితంగా తాత్కాలికంగా దిగిపోవడానికిముందు రెండు మూడేళ్ళు, గద్దెనెక్కకముందు ఎన్నికల ప్రచారంలో భాగంగా, 'నక్జలైట్లు' "దేశభక్తులు" అంటూ డబ్బా గొంతుతో ఉబ్బించిన కపటసన్యాసి గద్దెమీద ముడ్డిమోపి కుదురుగా తిష్ఠవేశాక వెనకటి కాంగ్రేజీ విధానాలనే విప్లవకారులపట్ల కొనసాగించాడు. కేంద్ర మంత్రివర్గం కాంగ్రెసుదే అయినా, విప్లవోద్యమాన్ని నామరూపాలు మిగల

కుండా చేద్దామని అదనపు పోలీసు, పేరా మిలిటరీ బలగాల కోసం కాలు విరిగిన కుక్కపిల్లలా కేంద్రానికి మనవులా మహజర్లూ కమ్యూమ్యోలు పంపు కొన్నాడు. రాష్ట్రంలో రాజకీయంగా ఏ బలమూ లేకపోయినా, కేంద్రంలో మాత్రం విదేశాంగ మంత్రిగా పవరూ పరపతీ గలిగిన ఒకానొక మంత్రి (పి. వి. నరసింహారావు) పనిగట్టుకొని వచ్చి తె. దే. పార్టీ ముఖ్యమంత్రి చెన్నలు కొరికి బేరం కుదుర్చుకొని వెళ్ళడం ఈ నవలలో ప్రస్తావనకు వస్తుంది కూడా.

ఇలాంటి పరిస్థితిలో దళం కర్తవ్యం, తన వునికినీ మనికినీ నిలబెట్టు కుంటూనే ఈ ప్రాంతంలో జరుగుతూవచ్చిన ప్రజాపోరాటాలను కొనసాగిస్తూనే మరింత విశాలమైన ప్రాంతానికి తన కార్యకలాపాలను విస్తరింపజేసుకోవడమే. మరిన్ని ఆయుధాలు సేకరించుకోవాలి ఎప్పటికప్పుడు శత్రువు దాడులనుంచి తప్పించుకోనైనా తప్పించుకోవాలి, లేదా వాటిని తిప్పికొట్టనైనా కొట్టాలి ప్రస్తుతానికి ఈ రెండోది దాదాపు అసాధ్యమే. ఈ సాయుధపోరాట క్రమంలో జనం పోరాటశీలతను నిలబెట్టాలి, పెంపొందించాలి. 'జంగ్లాత్' వాళ్ళేమి, పోలీసు లేమి, కొత్త ఎత్తుగడలకు దిగిన స్థానిక భూస్వాములేమి, విడివిడిగానూ కలిసి కట్టుగానూ చతుర్విధోపాయాలతో జనం ఆటకట్టించబూనారు. పీడిత రైతాంగంలో చీలికలు సృష్టించారు. నిరుత్సాహం కలిగించజూచారు. పిరికితనం పట్టించబోయారు. కొందరు జుట్టు అందించుకోగా, ఇంకొందరు తెలివిగా సర్దుబాటుధోరణిని చూపెట్టారు. అయినా, జనం మరోసారి మోసపోలేదు. తునికాకు కూలి పోరాటానికి మళ్ళీ దిగుతున్నారు. వెదురుకూపల పోరాటానికి సిద్ధమవుతున్నారు. 'బంచరాయి' భూములుగా భూస్వాములు దఖలుపరచుకొని అనుభవిస్తున్న పొలాలలోకి అరకలు సాగిస్తున్నారు. అటవీరక్షణ పేరుతో 'పోడు' సాగుదారుల నోరుకొట్టి టేకుమొక్కలతోబాటు పిచ్చితుమ్మ మొక్కలనుకూడ నాటుతూ, 'రిజర్వు' అడవులలో ఇళ్ళువేసుకొని సాగుచెయ్యకూడదని గుడిసెలను పీకివేస్తూ గూడేలకు నిప్పు పెడుతూ, గోడుగుడిపే 'జంగ్లాత్' వాళ్ళకు ఎదురునిలిచి గెలుస్తున్నారు. 'అభివృద్ధి' ప్రణాళికలంటూ మేకలతో బాటు 'హోమ్‌గార్డు' ఉద్యోగాలను ఎరజెట్టి తమ పోరాట చేవను హరించజూసే రెండు నాలుకల వ్యవహారం లోగుట్టు గ్రహించగలుగుతున్నారు. దళాన్ని తమ తలలో నాలుకగా ఎంచుతున్నారు. వస్తే తిండిపెట్టి ఆశ్రయమిస్తున్నారు. పోలీసుల పోవిడిగురించి వార్తలందిస్తున్నారు. తమ కన్నబిడ్డలను కొందరిని దళసభ్యులుగా సైతం సమకూరుస్తున్నారు. తమకు కావలసింది అటు ప్రభుత్వమా, ఇటు దళమా, అని తేల్చుకోమంటే, అవ్వాబువ్వా బాపతుగా

రెండూ కావాలనడంగాక, దళాన్నే ఎంపికచేస్తున్నారు ఇలాంటి జనం నడమ ఇలాంటి జనం భాగస్వామ్యంతోటి, సాగుతూన్న పోరాటాలతో నిండిన కాలం ఈ కథాకాలం. ఇది వర్తమానకాల విశేషం మాత్రమేకాదు. సమీప గతంలో దీని వేళ్ళున్నాయి. భవిష్యత్తులోకి దీని శాఖలు విస్తరిస్తాయి. త్రికాలాలనూ పొదివిపట్టిన ఈ చారిత్రిక ఘట్టం అసలుపేరు విప్లవదశ. ఆత్మ రక్షణ ఉపదశ. ఇంకా ప్రతిఘటనా పోరాటదశ మొదలుకాలేదు. నిర్దిష్టంగా, 1985 ఎండాకాలం.

"భీమన్నకు ఆకలి బాగైతన్నట్టున్నది" బొజ్జ కిసుక్కున నవ్వి అన్నాడు.

"ఔమల్ల - కడుపుకోసమే కదా బొజ్జ మనం గీ బాందేలు భుజాల కేసుకుంటిమి" భీమన్న

"కాదు రాజ్జెంకోసం" అన్నాడు సోము

"భూములకోసం, జాగలకోసం" చంద్రయ్య

కడుపుకోసమా, భూములకోసమా, లేక రాజ్యంకోసమా అన్నప్పుడు భీమన్న సొంతకడుపుకోసం మాత్రంకాదు, జనం కడుపులకోసం అని చెప్ప వచ్చు భూముల అవసరం దీన్నిబట్టే ఏర్పడుతుంది. మరి, ఈ భూములు జనానికి దక్కాలంటే, రాజ్యాధికారం వాళ్ళదే కావలసివుంది. ఉన్న విష యాన్ని ఇలా అనేక కోణాలనుంచి చూడవచ్చు. అయితే, కేవలం ఆర్థిక కోర్కెలకోసమేనా ఈ సాయుధపోరాటం? అని కొందరు ప్రబుద్ధులు అంటు న్నారు. వీటికి "మిలిటెంట్ ఆర్థిక పోరాటాలు" అని నామకరణంకూడా చేస్తున్నారు. కాని, వీటి తెన్నుగానీ అంతిమ లక్ష్యంగానీ ఈ పరిమిత పోరాట రూపాలను మించింది. అయితే, ఉట్టికెక్కకుండానే స్వర్గానికెక్కజూచేవారిని విప్లవ కాల్పనికవాదులనవచ్చు. కాకుంటే, తోక తెగిన నక్కలు. అందే ద్రాక్ష పళ్ళు వారికి రుచిస్తాయా?

పాత్రలు—

దళానికి దళంగా ఒక వ్యక్తిత్వం ఉంది. అది సమిష్టి వ్యక్తిత్వం. అందులోని వ్యక్తుల ప్రత్యేక వ్యక్తిత్వాలను మించింది కాబట్టి అది వట్టి కూడిక మాత్రమేకాదు. సహభాగిత్వం దీని విశిష్టత. వ్యక్తులు మారుతూ ఉండవచ్చు. వచ్చిచేరుతూ విడిపోతూవుండవచ్చు. కలిసివున్నంతకాలం ఇది ఒక యూనిట్. తిండితిప్పలు మొదలు కవాతు, ఆయుధశిక్షణ వరకూ

దీనికి ఏకత్వం ఉంది. శ్రీకాకుళం పోరాటంలోనైతే, వాగంటి భాస్కరరావు, దేవినేని మల్లికార్జునుడువంటి డాక్టర్లు, రాజారామిరెడ్డివంటి ఇంజనీరింగ్ విద్యార్థులూ, అంటే ఉన్నత విద్యావంతులు ఉద్యమంలోకి వచ్చారు. ఇప్పుడు అలాంటివారు ఉండడంలేదే అని అంటూన్న పోలీసు అధికారుల బాధనుచూస్తే నవ్వుబుద్ధేస్తుంది. అక్కడికి ఆ మేధావులను తమ ఖజానికెక్కించుకున్నట్టు, ఇప్పటి పోరాటంలోకూడా మొదట్లోనయినా విద్యార్థులూ విద్యాధికులూ కొద్దిగా నయినా ఉద్యమంలోకీ గెరిల్లాదళాల్లోకీ కూడా వచ్చారు. అయితే, ఎంతకాలం నిలిచారన్నది వేరేవిషయం. ఉద్యమం జనంలోకి చొచ్చుకుపోయి పీడితవర్గ శ్రేణుల పోరాటచైతన్యాన్ని కెరలించిన ప్రస్తుతదశలో, సాదాజనంనుంచే ఎక్కువగా పోరాటకారులు వస్తున్నారు. ఇది కోరుకోదగిన మార్పు. దళం మేధాస్థాయి ఇప్పుడుకూడా తక్కువదేమీకాదు. ఈ నవలనేచూస్తే, దళ సభ్యుల్లో ఒకరిద్దరే కావచ్చుగాని, జాన్‌రీడ్ "ప్రపంచాన్ని కుదిపేసిన పది రోజులు", చైనాగురించి బెతెల్‌హామ్ రాసిన పుస్తకానువాదమూ చదివి చర్చించ గలిగిన స్థాయిలో కనిపిస్తారు. పలకా బలపమూ చేతబట్టి అక్షరాలు కూడపలికే స్థాయిగల సభ్యులనుంచి ఉన్నత ప్రమాణాల స్థాయిగలిగిన సభ్యులవరకు దళసభ్యుల్లో హెచ్చుతగ్గులు కొన్నివున్నా, ప్రాక్టికల్ విషయాల్లో ఒకరు ఇంకొకరికి తీసికట్టనిపించదు. ముందొకనాటికైనా ఇలాంటి దళాలలోచేరి పాల్గొనేవాళ్ళు పూర్తిగా గోండులో ఇతర పీడితులో కావలసివుంటుదన్న స్పృహ, ప్రజాసేన నిర్మాణానికి దారితీయగలదు. కథలో ప్రధానపాత్ర ఎవరిదయినప్పటికీ, అంతకంటె ముఖ్యమైంది దళంపాత్ర. పరిస్థితుల ప్రాబల్యం కారణంగానూ ఎత్తుగడలు కారణంగానూ ఇది నిలిచినచోట నిలవదు. కొత్తప్రాంతాలను సర్వేచేస్తుంది. పాతవాటిలో నిలదొక్కుకుంటుంది. జనాన్ని పేరుపేరునా పలకరిస్తుంది. వాళ్ళు పెట్టిన అన్నం తింటుంది. వాళ్ళకు వైద్యసహాయం చేస్తుంది. దురాచారాలనుంచి తప్పిస్తుంది. ఆడుతుంది, పాడుతుంది. ఉపన్యాసాలు చెబుతుంది. ఉత్సాహం నిలబెట్టుతుంది. పోరాటాలకు నడుపుతుంది. విజయాలు చేకూరుస్తుంది. వివిధ రూపాలలోవున్న శత్రువుల పనిపడుతుంది. ప్రభుత్వాన్నే ఎదుర్కొంటుంది. ఇలాంటి దళాలే లేకపోయి ఉంటే, పోరాటాలు ఫలవంతం కాకపోయివుంటే, ప్రభుత్వం 'సంస్కరణ'లతో దిగివచ్చేదే కాదు. కాబట్టే దళం జనంతో పెనవేసుకు పోగలుగుతూంది. అది జనం కళ్ళవెలుగు, జనం కంఠస్వరం, జనం గుండెకాయ, జనం జీవగర్ర.

ఇలాంటి దళాలలోకి వచ్చివుంటూన్నవాళ్ళు పందిబిడ్డలే. కరీంనగర్ జిల్లా మనిషి భీమన్న రెండెకరాల పేదరైతు. అవి దొర పాలయ్యాయి. జగిత్యాల సభచూసి ధైర్యం తెచ్చుకున్నాడు. తన పొలంలోదిగి 'గుంటుకు' నడపబోతే దొర మనుషులువచ్చి గడీకి పట్టుకెళ్ళి "పెయ్యంత రకుతామండలం అయ్యేదాక" కొట్టి మూడురోజులు నిర్బంధించాక జనంవచ్చి గొడవచేస్తే విడిచారు. ఈ అనుభవమే భీమన్నను దళంలోకి తెచ్చింది. నాలుగేళ్ళ కిందటిదాకా "అమాయకంగా" ఉండిన గోండురైతు బొజ్జు, జంగ్లాతువాళ్ళన్నా షావుకార్లన్నా, తెల్లబట్టలు వేసుకొన్న ఎవరైనా, అతనికి భయపడేవాడు. "అతని బతుకు అనేక మలుపులు తిరిగి చివరకు నాగలిపట్టిన చేతికి రైఫిల్ వచ్చింది" రాధక్క గోండు యువతి. జులాయి మనిషి. అంబతిరావును పెళ్ళాడింది పుట్టినబిడ్డ దక్కలేదు. అంబతిరావు కొన్నాళ్ళు అన్నలవెంట తిరిగాడు. బాగా పాడగలిగిన రాధక్క ఇంద్రవెల్లి సభలకంటె ముందు తాను ఊరూరాతిరిగి పాడుతానంటే భర్త వద్దన్నాడు. పోట్లాడుకున్నారు. అంబతిరావు తాగుడు ఎక్కువైంది ఇంద్రవెల్లి కాల్పులతర్వాత పోలీసుల దాడిలో పట్టుబడి బాగా దెబ్బలుతిన్నాడు. బయటపడి వచ్చాక భార్యను హింసించడం మొదలెట్టాడు. అతన్ని విడిచి పుట్టిల్లుచేరింది. అంబతిరావు మరొక స్త్రీతో ఆసిఫాబాదువెళ్ళి హోంగార్డు నౌకరీ సంపాదించుకున్నాడు. క్రమంగా రాధక్క అన్నలకు సన్నిహితమై దళంలోకి వచ్చిచేరింది. మరి, గోపాల్ ఉన్నాడు. పసితనంలోనే తలిదండ్రులు చాటుకోగా పినతండ్రి చేరదీశాడు. ఆ తర్వాత పినతండ్రికి పిల్లలుకలిగారు. అప్పటినుంచీ అవస్థ మొదలైంది. తిండీ స్నానంకూడా కరువయ్యాయి. "నేను మల్లిగీ పారిటీల కచ్చినంకనే కడుపు నిండ తిన్న- నాకైతే ఈ దళమే అయ్య - లచ్చన్నే అవ్వ-". పద్మశాలి కుటుంబంలో పుట్టిన లచ్చన్న, బొగ్గుబావులలో పనిచేస్తూన్న తండ్రి రోగాన పడ్డాక మరేపనీ దొరక్క బట్టలదుకాణంలో చేరి పనిచేస్తూచేస్తూ, పెద్ది శంకర్ వాళ్ళ పరిచయంతోటి ఉద్యమంలోకి వచ్చాడు. ఇలా ఒక్కొక్కరిదీ ఒకోకథ అయినా, అందరి కథల సారాంశం మాత్రం ఒక్కటే. కాబట్టే అందరూ వేర్వేరుగా వచ్చి ఈ దళంలో ఒక్కటయ్యారు.

"మనం మన వ్యక్తిగత జీవితమనే చిన్న గుడిసె నుండి బయట కొచ్చాం. బయట కోటానుకోట్ల ప్రజలతో లీనమయ్యాము".

సోదర బంధం వాళ్ళను ఒక్కటి చేసింది. కష్టసుఖాలు పంచుకుంటున్నారు. ఈనాడు ఉన్న సభ్యుడు రేపటికి మిగులుతాడో లేదో నన్నంతగా

శత్రుచర్యల మధ్య పనిచేస్తున్నారు. దళం మొదటి నాయకుడు లచ్చన్న యస్. ఐ. మోహన్‌రెడ్డి తుపాకితూటాకు బలి అయ్యాడు. చావు ముట్టడి వేసినట్టుంది. అయినా తమ దీక్ష కుంటుబడలేదు. తమ మానవత్వాన్ని నిలుపుకుంటూనే వున్నారు.

విధవరాలైన కన్నతల్లి శోకాన్ని చూసికూడా ఉద్యమంలోకి తిరిగి వచ్చాడని "నీకు రవ్వంత నెనరు లేదు" అంటూ లచ్చన్నను రాధక్క తప్పు పడుతుంది. అప్పుడు లచ్చన్న ఇలా బదులంటాడు :

"రాధక్కా! నా కామ్రేడ్! మన గుండెలు బండబారిపోతే - నువ్వన్నట్టు మనకు నెనరే లేకపోతే - ఈ బండల మధ్య సాయుధులమై ఉండేవాళ్ళ మంటావా? లోకంలోని దుర్మార్గాలన్నీ చూస్తూ, వీలైతే అందినకాడికి మనం దోచుకుంటూ బతికేవాళ్ళం. మానవులపట్ల ప్రేమ, నెనరు గలవాడే కమ్యూనిస్టు - రాధక్కా ఈ దేశంలోని కోటానుకోట్ల పేదతల్లులలో నీ తల్లి, నా తల్లి ఉన్నది. వాళ్ళ దుఃఖం ఉన్నాయి (Sic). వాళ్ళ కన్నీళ్ళు తుడవడం కన్నా - ఈ లోకంలోనుండి దుఃఖాన్నంతా పారదోలడానికి మనం మన సర్వస్వాన్ని త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాము. కాదా?...."

ఇలాంటి దళంలోకి వచ్చి చేరాడు లింగయ్య అనే పద్దెనిమిదేళ్ళ కుర్రాడు. అతనిది ఈ పోరాట ప్రాంతంలోని ఒక పల్లె. తమ కుటుంబం ఆస్తిపాస్తులేవీ లేనిది. అన్న రాయమల్లు పాలేరు. తల్లి గట్టుమల్లు గుడ్డిది. లింగయ్యలో చురుకుపాలెక్కువ. ఒకరొక మాట అంటే పడేవాడు కాదు. తీవ్రమైన నిరసనభావం ఉండేది. పల్లెకి వచ్చిపోయే అన్నలతో వెళ్ళి తిరిగి వస్తుండేవాడు తల్లి తిట్లు భరించలేకనే ఇప్పుడు ఇల్లు వదిలి వచ్చి గట్టయ్య పేరుతో కొంతకాలం దళంలో ఉన్నాడు. అయినా రాజకీయంగా ఎదగలేక పోయాడు. తాను లేనప్పుడు పల్లెపై జరిగిన పోలీసు దాడిలో వదినె గంగమ్మ తొలిచూలు నేలపాలైపోయింది. మరొక సందర్భంలో పోలీసుల తుపాకి మడమల దెబ్బలకు అన్న రాయమల్లు ఒళ్ళు హూనమై ప్రాణం పోయింది. అలాంటి పరిసరాలలో, వేధించే జ్ఞాపకాల మధ్య మరి ఉండలేక గంగమ్మ పుట్టింటికి వెళ్ళిపోగా, తల్లి దిక్కుమాలిపోయింది. ఈ వార్తలందాక గట్టయ్యకు ఇంటిమీద మనసు పోయింది. దళ సభ్యులు ఎంత వచ్చజెప్పినా వినకుండా మళ్ళీ గ్రామానికి తిరిగి వచ్చేశాడు. వచ్చాడేగాని బావుకొన్న దేమీ లేదు. ఎక్కడో సిరోంచదాకా వెళ్ళి పనిచేసి, కుటుంబానికి సంబంధించిన చెదు

వార్తలు విన్నాక తిరిగి వచ్చేశానని చెప్పుకుంటూ పోలీసుల దృష్టికి పోకుండా సుగుణాకరరావు వద్ద పినతండ్రితోబాటు పాలేరుగా కుదిరాడు. జొన్నచేలో అన్నలు రహస్యంగా సమావేశమయ్యారని తూకిపడిన పోలీసులు ఆ సమయానికి చేలో కాపలావున్న లింగయ్యను అనుమానించి పట్టుకెళ్ళి రహస్యం చెప్పమంటూ చావగొట్టారు. రోలర్ ట్రీట్మెంటు ఇచ్చారు. తలకిందులుగా వేలాడదీసి లాఠీలకు పనిబెట్టారు. అయినా లింగయ్య నోటినుంచి తమకు పనికివచ్చే మాట ఒక్కటికూడా రాలేదు. ఉద్యమంనుంచి జారిపోయిన ఒక ద్రోహి అతన్ని దళ సభ్యుడైన గట్టయ్యగా గుర్తించడంతోటి, లింగయ్యకు దళ సభ్యుడి యూనిఫారం వేసి, ప్రజలను నిరుత్సాహపరిచేందుకు దళానికి సంబంధించిన రహస్యాలను వెల్లడించేశాడన్నట్లుగా ఊళ్ళ వెంబడి తిప్పుతూ పోయారు. అదికూడా పనిజేయకపోయేసరికి, కొండల్లోకి తీసుకెళ్ళి కాల్చివెయ్యాలని నిర్ణయించుకొన్నారు. అంతపనీ జరిగేదేగాని, మూడు గజాల దూరంలోనే గురిపెట్టిన డి.యస్.పి. పిస్టల్‌ను లెక్కించకుండా ఉదుటున దూకి గుండ్లను తప్పించుకుంటూ తుప్పలమీదుగా గుట్టల్లోకి పరుగుదీశాడు. దళాన్ని తిరిగి చేరుకోవాలన్నది ఒక్కటే తన కోరిక. తాను ద్రోహిని కాలేదని చెప్పాలి. బండలూ ముళ్ళూ లెక్కలేదు. ఆకలీ దాహమూ అడ్డురాలేదు. పెద్దపులినుంచికూడా చావు తప్పించుకొన్నాడు. మళ్ళీ ముందుకు నడిచాడు. రాత్రీ పగలూ తేడా లేకుండా పోయింది. కాళ్ళు వశం తప్పుతున్నాయి. ఒక గట్టమీద పడి నెత్తురోడుతూ లేచి మళ్ళీ నడక సాగిస్తూ మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతానికి వచ్చాడు, తెలివి తప్పింది, మూలగసాగాడు. ఈ మూలుగులు విన్న దళం సభ్యులు వచ్చి చూసి గుర్తించారు, మోసుకుపోయారు. స్పృహ వచ్చేసరికి తనమీదికి తానెరిగివున్న ముఖాలు వంగివున్నాయి. "గట్టయ్య కండ్లల్లో ఎక్కడలేని వెలుగు". అందరినీ కౌగిలించుకున్నాడు. తుపాకీని తెచ్చి తన పక్కన పడుకోబెట్టుకున్నాడు. తల్లిని కరుచుకొని పడుకునే పసిపిల్లవానిలాగా దాన్ని కావిలించుకున్నాడు, నిద్రలోకి జారుకున్నాడు. గట్టయ్య దళంలోకి రావడం, వెళ్ళిపోవడం, మళ్ళీ రావడం - ఇదే నవలాకథ. అదే ముఖ్య పాత్ర.

అట్లని ఇతర పాత్రలను తీసివెయ్యవలసిన పనిలేదు. దేవిక దే విలక్షణమైంది. ప్రతి పాత్రకూ వ్యక్తిత్వం ఉంది. నవలాకారుడుగా ఆనంద మోహన్ ఈ విషయంలో విజయం సాధించాడు. పాత్ర నిర్మాణం ఒక గొప్ప కళ అని రుజువు చేసుకున్నాడు.

దళసభ్యులు సమిష్టిగా కథానాయకు లనుకొంటే, ప్రతినాయకులు అనే కులు విడివిడిగా కథాగమనానికి తోడ్పడుతున్నారు. వారి నందరినీ కలిపి సమిష్టిగా 'ప్రజాశత్రువు' అని వర్ణించవచ్చు. వీరిలో తునికాకు కాంట్రాక్టరు రాఘవరెడ్డి, ఫారెస్టు రేంజరు రాజగోపాలరావు, లచ్చన్నను కాల్చి ఆ రక్తంతో తడిసిన గుడ్డలతో యింటికి వచ్చి భార్యలో జుగుప్సనూ భయాన్నీ కలిగించిన యస్సై మోహన్‌రెడ్డి, 'నక్సలైట్లను చంపడం హాబీగా భావించే యస్.పి. మిశ్రా, ఎక్కడో గుంటూరు జిల్లాలో హరిజన కుటుంబంలో పుట్టి స్కాలర్ షిప్‌తో చదువు పూర్తిచేసి యస్.ఐ ఉద్యోగంలోకి వచ్చి ప్రమోషన్ ఆశలతో జనంమీదికి విరుచుకుపడే వెంకటరత్నం, వ్యాపారిగా ప్రవేశించి భూస్వామిగా మారి జులుం సాగించి ప్రజల సంఘటిత శక్తి ముందు ఊళ్ళో నిలవలేక బస్తీకి వెళ్ళిపోయిన సాంబశివరావు, తండ్రి అనుభవంనుంచి గుణపాఠం తీసుకొని భయాన కాదనుకొన్న పనిని నయాన సాధించాలనుకొంటూ వెనకటి కాంగ్రెసుపార్టీని వదిలి కొత్త ప్రభుత్వ పక్షమైన తెలుగుదేశం పార్టీ మతం పుచ్చుకుని 'మధ్యకులాల' వాళ్ళను కూడగట్టి విప్లవోద్యమంనుంచి తప్పుకున్న యువకులను వెంటవేసుకొని పెద్దమనిషిలా వ్యవహరిస్తూ ఒకవైపున పేద రైతాంగంమీదికి పోలీసులను ఉసిగొలుపుతూనే మరొకవైపున పోలీసు దౌర్జన్యాలను ఖండిస్తూ సొంత పబ్బం గడుపుకునే సుగుణాకరరావు- ఇలా ఎన్నో పాత్రలు ప్రతిదానికీ తనదైన ముఖం ఉంది. ఏ ఒకటీ అసహజమని పించదు.

ఇంతమంచి ఇతివృత్తాన్ని నవలీకరించిన ఆనందమోహన్‌కు తన శైలిగురించి పూర్తి ఆత్మవిశ్వాసం లేకపోవడం ఆశ్చర్యకరం. ఉత్తర తెలంగాణా యాస కనీసం విప్లవసాహిత్య పాఠకులకైనా ఇప్పటికే బాగా పరిచయమైపోయింది. అయినా గ్రంథం చివర్లో అర్థాల పట్టిక వుంటే మరింత సహాయకరంగా ఉండేది. ఆరునెలల కాలంలోనే పూర్తిఅయిన ఈ నవలనుచూసి సలహాలు చెప్పిన గ్రంథకర్త మిత్రులుగానీ దీని ముద్రణ, ప్రచురణల బాధ్యతలను వహించినవారుగానీ, ఆనందమోహన్‌కు ఒక విష యంలోమాత్రం అన్యాయం చేశారు. శబ్దదోషాలను కొన్నిటిని సవరించి ఉండవలసింది. న, ణ లకూ, స, శ, ష లకూ మధ్య రచయిత అనేక సందర్భాలలో అపశబ్దాలు ప్రయోగిస్తున్నాడు. ఉదాహరణలివ్వడం, అనవ సరం. ఇలాంటివి రచనాస్థాయికి వెలితి.

విప్లవసాహిత్యంలో ఇంతక్రితం 'చారిత్రక'నవలలు పూర్తిగాలేవనడం నిజంకాదు. 'కొమురం భీమ్'ను అటుంచినా, ప్రస్తుత ఉద్యమానికి సంబంధించి అల్లం రాజయ్య 'అడది అగ్నికణమైతే' పేర్కొనదగిన ప్రయత్నం. అయితే, లోపభూయిష్టమైన ప్రవర్తన కలిగిన ఒకానొక స్త్రీని ప్రధానపాత్ర చెయ్యడంగురించి కొన్ని అభ్యంతరాలు వెలువడ్డాయి. నిజానికి, అవి న్యాయమైన విమర్శలుకావు ఉద్యమంలోకి వస్తున్నవాళ్ళలో, జీవితంలో దగాపడి దౌర్జన్యానికిలోనై వ్యక్తిగతమైన విముక్తితోబాటుగా సమిష్టివిముక్తిని ఆశించే వాళ్ళుకూడా ఉండవచ్చు. లైంగిక దౌర్జన్యమూ దోపిడీ సైతం సామాజిక విషయాలే. ఈ నవలలో అలాంటిది కనిపించకపోయినా, ఇతర రూపాలలోని దౌర్జన్యాన్నీ దగానీ దోపిడీని సహించక ఉద్యమంలోకి వస్తున్నవాళ్ళు పాత్రలుగా నిలబడుతున్నారు. వీళ్ళ ఆశయం సమున్నతం. రాధక్కతో దళం కమాండర్ లచ్చన్న చెప్పిన మాటల్లో-

"రాధక్క, నా కామ్రేడ్! ఈ అడివిలో కలిసిన మనం ఎవరం మిగులుతామో తెలియదు. కాని మన ఆశయాలను మోయడానికి మానవులు మిగులుతారు. మనం శోధించిన, నడచిన ఈ అడవిదారులు రేపటి విముక్తికి దారులౌతాయి. ఎవరం మిగిలినా ఈ ఆత్మీయతను, ఈ స్వచ్ఛమైన ప్రేమను పంచుతారు."

వసంతగీతం - పులి ఆనందమోహన్ - వెల 20-00 రూ.

ప్రతులకు :— కె. సులోచన,

36-9-29, హౌజ్ ఆఫ్ జాన్‌పీటర్,

గిరిపురం, విజయవాడ.

విరసం విశేషాలు

అనంతపురం జిల్లా యూనిట్

అనంతపురం విరసం యూనిట్ ఆగస్టు 27, 28 తేదీలలో అనంతపురంలోనూ ఉరవకొండలోనూ కా॥ చెరబండరాజు సంస్మరణ సభను నిర్వహించింది. ఓ అరుణపతాకమా! పాటతో సభ ప్రారంభమైంది.

ఆగస్టు 27న అనంతపురంలో జరిగిన సభకు కా॥ అరుణ్ అధ్యక్షత వహించారు. కా॥ వి. వి. ప్రధానవక్తగా విరసం చరిత్రను చెరతో సంస్థ అనుబంధాన్ని సభికులకు వివరించారు. తలక్రిందులుగా ఉన్న ఈ భూమి, ఈ

భూమికి సంబంధించిన కళలు, సంస్కృతిని, చరిత్రను సరిచేయాల్సిన కర్త వ్యం, బాధ్యత ఈనాటి మేధావులపైన ఉందన్నారు.

పీడితరైతాంగం పిడికెడు తిండికోసం, ఆ తిండినిచ్చే భూమికోసం ఆకలిపోరాటం చేస్తుంటే అధికారయంత్రాంగం ఆ రైతాంగంపై తీవ్రనిర్బంధాన్ని అమలుచేస్తూందన్నారు.

విరసంచరిత్ర రైతాంగ ఉద్యమచరిత్రతో ముడిపడివుందనీ, ఆక్రమంలోనే విప్లవకవులు కా॥ బి.సి. రామప్ప, పరిటాల రాములు, జ్ఞానేశ్వర్‌కీర్తి, మొదలగువారు ప్రాణాలర్పించారనీ అన్నారు.

కోట్లాది పీడితప్రజల పోరాటగేయాలు చెరబండరాజును అమరునిగా నిలిచేటట్లుచేశాయని వివరించారు.

ఆగస్టు 28వ తేదీన ఉరవకొండలో ఓ అరుణ పతాకమా! అనేపాటతో చెర సంస్మరణ సభ ప్రారంభమైంది. ఈ సభకు కా॥ అరుణ్ అధ్యక్షత వహించారు. కా॥ వరవరరావు ప్రధాన ఉపన్యాసకులుగా వాగేశ్వరాచారి, శశికళలు కూడా మాట్లాడారు.

అధ్యక్షులు కా॥ అరుణ్ మాట్లాడుతూ సమస్త వృత్తుల జీవితాలకు రైతు పండించే పంట ప్రధానమనీ, అటువంటి రైతు భూమికోసం భుక్తికోసం పోరాటంచేస్తూంటే ఆ రైతాంగ పోరాటాలకు మద్దతు నియ్యాల్సిన కర్తవ్యాన్ని వివరించారు. కా॥ చెరబండరాజు జీవితాన్ని, విప్లవ రచయితలపైన నిర్బంధాన్ని వివరించారు.

కా॥ వరవరరావు పీడిత రైతాంగ ఉద్యమాలను, రిజర్వేషన్ల సమస్యను వివరించారు. ప్రపంచ పురోగతి సాంతం శ్రమజీవి నెత్తుటి బొట్టులోనే ఇమిడివున్న సత్యాన్ని గుర్తుచేశారు. చాటాలలో జరిగిన జననాట్యమండలి శిబిరంపై పోలీసుల దాడిని, మళ్ళీ ప్రారంభమైన ఎన్‌కౌంటర్ల ప్రహసనాన్ని, కా॥ కేశోనాయక్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన తీరును వివరించారు.

కా॥ శశికళ ప్రసంగిస్తూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువయిందని, దాదర్ ఎక్స్‌ప్రెస్‌లో సామూహిక అత్యాచారం జరిపిన దుండగుల్ని, అనంతపురంలో గౌసియా అనే అమ్మాయి మృతికి కారకులైన గూండాలను కఠినంగా శిక్షించాలని కోరారు.

సభకు దాదాపు 700 మంది హాజరవడం, వారిలో పేద రైతాంగం యువకులు వుండటం విశేషం. సభ మధ్యలో రెండుమార్లు పెద్దగా వర్షం

పడినా, కరెంటు పోయినా సభకు హాజరయినవారు బయటికి వెళ్ళకపోగా, ఉపన్యాసాన్ని కొనసాగించాలని, తాము వేచివుంటామని చీకటిలోనించి డిమాండ్‌చేసి విరసంపైన, చెరబండరాజుపైన తమకు గల అభిమానాన్ని వ్యక్తంచేశారు.

ఉరవకొండ ప్రాంతాల్లో భూస్వాములకు మద్దతుగా రైతుకూలీలపై ఎస్.ఐ. చంద్రశేఖరరెడ్డి దమనకాండను విరసం అనంతపురం యూనిట్ ఖండించింది.

స్థానిక పట్టణ గౌసియా అనే పేద ముస్లిం బాలిక గూండాలచే అవమానించబడి ఆత్మహత్య చేసుకోనడం, దానిపై ఆ గూండాలను శిక్షించాలని SUCI, MSS, APCLCలతో కలసి ఒక సభ నిర్వహించడం జరిగింది. విరసం తరపున కా॥ శశికళ ప్రసంగించారు.

అనంతపురం జిల్లాలో కుళ్ళాయప్ప అనే హరిజనుడిని భూస్వాములు సజీవదహనం చేశారు. ఆ భూస్వాములను పోలీసులు అరెస్టు చేయకపోవడంతో దళిత సంఘం, అంబేద్కర్ కమిటీ అధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో విరసం సభ్యుడు కా॥ అరుణ్ పాల్గొన్నాడు.

కృష్ణా జిల్లా యూనిట్

విరసం కృష్ణా జిల్లా యూనిట్ ఐదో మహాసభ ఆగస్ట్ 26 (ఆదివారం)న జయప్రదంగా జరిగింది. విజయవాడ మధుకళా మండపం ముందు ఉదయం 10 గంటలకు విరసం పతాకావిష్కరణతో కార్యక్రమం ప్రారంభమైంది. అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె.వి ఆర్. విరసం జెండాను ఆవిష్కరించారు జననాట్యమండలి కళాకారులు 'ఎత్తినాం విరసం జెండా', 'ఓ అరుణ పతాకమా' గీతాలు ఆలపించిన తర్వాత కామ్రేడ్ తిరుపాల్ హాలులో సమావేశం ప్రారంభమైంది

1988 జులై 3న జరిగిన నాలుగో మహాసభ నుంచి ఈ రెండు సంవత్సరాల కాలంలో కృష్ణా జిల్లా యూనిట్ నిర్వహించిన కార్యకలాపాల నివేదికను మాజీ కన్వీనర్ కామ్రేడ్ కే. నరసింహాచారి సభ ముందుంచారు. ఆ తర్వాత పులి ఆనందమోహన్ రాసిన నవల 'వసంతగీతం'ను కా॥ కె వి.ఆర్. విరసం నెల్లూరు జిల్లా యూనిట్ ప్రచురించిన 'నేలతల్లి విముక్తికోసం' కథాసంకలనాన్ని కా॥ డానీ ఆవిష్కరించారు.

'తెలుగు సాహిత్యంలో అనిబద్ధ ధోరణులు' అనే అంశంపై ప్రసంగా నికి అధ్యక్షత వహిస్తూ విరసం కార్యదర్శి కా॥ చెంచయ్య విరసం చరిత్రను, విప్లవ సాహిత్యోద్యమ కర్తవ్యాలను వివరించారు. చర్చాంశంపై ప్రసంగిస్తూ కా॥ ఎన్. వేణుగోపాల్ నిజంగా అనిబద్ధత అనేది లేదని, ప్రతి సాహిత్య కారుడూ తెలిసిగానీ, తెలియకగానీ నిబద్ధుడుగానే ఉంటాడనీ అన్నాడు. ప్రజల పట్ల, ప్రజాపోరాటాలపట్ల నిబద్ధత వహించాలని రచయితలకు విజ్ఞప్తిచేశాడు. అరసం రోజుల నుంచి 'అనిబద్ధ' ధోరణులకు గల పునాదిని వివరిస్తూ, 'అనిబద్ధత'ను ప్రచారం చేస్తున్న వాళ్ళలో తేడాను గుర్తించాలని, అమాయ కంగా 'అనిబద్ధత'ను నమ్ముతున్నవాళ్ళకు వాస్తవాలు వివరించి స్నేహహస్తం చాచాలని, ధూర్తత్వంతో 'అనిబద్ధత'ను ప్రచారం చేస్తున్న వాళ్ళను నిశితంగా ఖండించాలని అన్నాడు.

మధ్యాహ్నం సమావేశంలో కా॥ చెంచయ్య అధ్యక్షతన 'తెలుగు సాహి త్యంలో నిబద్ధ కృషి' అనే అంశంపై కా॥ హరి ప్రసంగించారు. కందుకూరి వీరేశలింగం పంతులు ఉద్దేశ్యపూర్వకంగానే సాహిత్యాన్ని సామాజిక సంస్క రణ ఆయుధంగా వాడాడని ప్రజలపట్ల నిబద్ధతతో సాహిత్యం సృష్టించే సాంప్రదాయం అప్పుడే మొదలయిందని, గురజాడ ఆ దారిలో ప్రధానమైన మైలురాయి అని హరి అన్నారు నిబద్ధత సృజనాత్మకతను కుంచింపజేస్తుం దనేది అబద్ధపు మాట అని ఆయన సోదాహరణంగా వివరించారు. విరసం, విప్లవ సాహిత్యోద్యమం చేసిన కృషిని ప్రశంసిస్తూ, వాటిపైన విమర్శలలో వాస్తవిక దృష్టిగానీ, పరిశీలనగానీ లేవని అన్నారు.

సాయంత్రం కా॥ ఈశ్వరి హాల్‌లో జరిగిన బహిరంగసభలో కామ్రేడ్ ఎన్. వేణుగోపాల్, కామ్రేడ్ వి. చెంచయ్య ప్రజా ఉద్యమాల గురించీ, నిర్బంధం గురించీ ప్రసంగించారు. కా॥ కె. నరసింహాచారి అధ్యక్షత వహిం చారు. ఉపన్యాసాల అనంతరం జననాట్యమండలి కళాకారులు 'కొండలు పగలేసినం' నృత్యంతో సహా అనేక పాటలు పాడారు. కా॥ వంగపండు ప్రసాద్ దళం సిక్కోలు యుద్ధం ఒగ్గుకథ చెప్పారు. గొప్ప విప్లవోత్తేజాన్ని రగిలిస్తూ జరిగిన ఈ మహాసభలో జిల్లా నలుమూలలనుంచీ విప్లవాభిమానులు, విప్లవ సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కృష్ణాజిల్లా విరసం యూనిట్ చేసిన తీర్మానాలు :

1) మళ్ళీ ప్రారంభమైన ఎన్‌కౌంటర్లను ఖండించింది.

2) న్యాయమైన కాశ్మీరీల ఆందోళనను సమర్థించింది.
3) దాదర్ ఎక్స్‌ప్రెస్ దురంతం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండించింది.
4) ఓట్ల జూదంలో పావుగా రిజర్వేషన్ల సమస్యను ఉపయోగించుకుంటున్న పాలకవర్గ కుట్రలను నిరసించింది.
5) విజయవాడ సున్నపుబట్టీల ప్రాంతంలో పదకొండేళ్ళుగా కాపురముంటున్న పేదలకు ఇళ్ళపట్టాలివ్వాలని డిమాండ్ చేసింది
6). వరదలనివారణకై ఏమాత్రం ప్రయత్నించని ప్రభుత్వాల హంతక వైఖరిని ఖండించింది.

విరసం కృష్ణాజిల్లా శాఖ ఆధ్వర్యంలో రిజర్వేషన్‌లపై సెప్టెంబర్ 15వ తేదీన విజయవాడలో బహిరంగ సభ జరిగింది. ఈ సభలో విరసం కార్యవర్గ సభ్యుడు కా॥ సి.ఎస్.ఆర్. ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడారు. విరసం సభ్యుడు కా॥ భరద్వాజ అధ్యక్షత వహించారు.

ప్రభుత్వ విధానాలవల్ల దేశంలో ఉద్యోగకల్పన కొరవడిందని, విద్యార్థులు, యువతీయువకులు సంఘటితమై ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వంపై పోరాటంచేయడం ప్రధానమని హరగోపాల్ అన్నారు. వర్గసమాజం, కుల వ్యవస్థ, దానికి సంబంధించిన భావజాలం ఉన్నంతకాలం రిజర్వేషన్‌లు ఉండి తీరాలని ఆయన అన్నారు. ఇవాళ రిజర్వేషన్‌లవల్ల దెబ్బతింటుందని చెపుతున్న "ప్రతిభ" సమాజానికి ఏమాత్రం ఉపయోగపడేది కాదని, ఇటువంటి ఏ "ప్రతిభ" లేని కష్టజీవులే సమస్త సంపదను సృష్టించి సమాజానికి మూల స్తంభాలుగా నిలబడ్డారని ఆయన అన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో రిజర్వేషన్‌లు అనివార్యమని, అయితే రిజర్వేషన్లు ఎప్పుడూ దారిద్ర్య నిర్మూలనకు పరిష్కారం కాదని కా॥ సి.ఎస్ ఆర్. ప్రసాద్ అన్నారు. భూమిసమస్య పరిష్కారమై నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావడంతోనే నిరుద్యోగ సమస్య అయినా మరే సమస్య అయినా పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు.

గుంటూరు జిల్లా యూనిట్

కోస్తా జిల్లాల్లో మే 9న సంభవించిన తుపాన్‌లో సర్వస్వం కోల్పోయి నిస్సహాయ స్థితిలో ఉన్న బాధితులకు తక్షణ సహాయం చేయటంలో, వారి

పోరాటంలో గుంటూరు జిల్లా, చిలకలూరిపేట టౌన్ యూనిట్ రాడికల్ యువజనసంఘంతో పాటు చురుకుగా పాల్గొంది.

మండల కార్యాలయంవద్ద నాలుగైదు వందలమంది పాల్గొన్న ధర్నాతో దిగివచ్చిన ఎమ్మార్వో వెంటనే బాధితులకు 5 కిలోల బియ్యం, కొంత కిరోసిన్ సప్లయ్ చేయక తప్పలేదు.

విరసం సభ్యులు ఈ ఉద్యమంలో పాల్గొనడమేకాక ప్రజా ప్రతిస్పందనలను కథనాల రూపంలో రికార్డ్ చేశారు.

నామమాత్రంగా ముట్టిన సహాయంతో తల్లులు పిల్లలకు కనీసం తమ పాలుకూడా ఇవ్వలేని స్థితిలో నీరసించిపోయిన చిన్న పిల్లలకు 'ఏ' విటమిన్ సిరప్ పంపిణీ చేశారు.

బోగస్ కార్డుల ఏరివేత పేరుతో, ప్రజల రేషన్ కార్డులను రద్దుచేస్తున్న ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ఖండిస్తూ గుంటూరుజిల్లా యూనిట్ స్థానిక ప్రజాసంఘాలతో కలిసి 'చలో కలెక్టరేట్'లో పాల్గొన్నది.

చిలకలూరిపేట సినిమా థియేటర్లలో అక్రమ 'బ్లూ ఫిలిం'ల ప్రదర్శనను నిరశిస్తూ చిలకలూరిపేట విరసం యూనిట్ స్థానిక ప్రజాసంఘాలను కలుపుకొని సంయుక్తంగా నిరసనను వ్యక్తంచేసింది.

గుంటూరుజిల్లా విరసం యూనిట్ ఆగస్టు 5వ తేదీన కాశ్మీర్ సమస్య మీద చిలకలూరిపేటలో బహిరంగసభ నిర్వహించింది. ఈ సభను కామ్రేడ్ సాంబశివరావు ప్రారంభించగా, జిల్లా యూనిట్ కన్వీనర్ కా॥ మౌనిక్ అధ్యక్షత వహించగా, కా॥ సి. ఎస్. ఆర్. ప్రసాద్, కా॥ చిలకా చంద్రశేఖర్ ప్రసంగించారు.

కా॥ సి ఎస్ ఆర్. ప్రసాద్ కాశ్మీర్ చరిత్రను, వర్తమాన కల్లోల పరిస్థితులను సోదాహరణంగా వివరిస్తూ ఇటీవల AILRC ఆధ్వర్యంలో జరిగిన తమ పంజాబ్ పర్యటనను క్రోడీకరించారు. ఈరోజు కాశ్మీర్ వర్తమాన కల్లోల పరిస్థితులకు బ్రిటిష్ భారత పాలకవర్గాల దమననీతి కారణమని చెప్తూ దానికి భారత బడా బూర్జువా భూస్వామ్యవర్గాల ప్రభుత్వం ఆజ్యం పోస్తున్నదని చెప్పారు. ఈ పోరాటాలు జాతి వ్యతిరేకమైనవని ప్రచారం చేస్తున్న BJP, RSS, కాంగ్రెస్, జనతాదళ్ ప్రజావ్యతిరేక వైఖరిని నిరసించారు.

కా॥ చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ "భారతదేశంలో బూర్జువా భూస్వామ్య వర్గాల దోపిడి ఫలితంగా జాతుల, ప్రజల అభివృద్ధి స్తంభించి

పోయిందని, అది వివిధ రాష్ట్రాలలో ఉద్యమ రూపం తీసుకుంటుందని, నామ మాత్రంగా ఉన్న ఫెడరల్ రాజ్యాంగాన్నికూడా తుంగలో తొక్కి 'యూనిటరీ స్టేట్' పేరుతో భారత దేశాన్ని జాతుల బందిఖానాగా మార్చారని దీనికి వ్యతి రేకంగా పోరాడుతున్న కాశ్మీర్, పంజాబ్, ఈశాన్య జాతుల పోరాటాలు జాతి వ్యతిరేక పోరాటాలు కావని అన్నారు.

సభకు అధ్యక్షత వహించిన జిల్లా కన్వీనర్ కా॥ మౌనిక్ మాట్లాడుతూ జాతుల పోరాటాలను ఈరోజు కమ్యూనిస్టుపార్టీ గైడ్ చేయాల్సిన అవసరం వుందని స్పష్టంచేశారు. ఈరోజు జరుగుతున్న జాతుల పోరాటాలు నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగంగా కొనసాగినప్పుడే వాటి విముక్తి సాధ్యమని కనుక నేడు విస్తారంగా జరుగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో జాతులు చేయిచేయి కలిపి పోరాడుతూ తమ జాతివిముక్తికై ముందుకురావాలని పిలుపునిచ్చారు.

విరసంతోసహా అనేక విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక సంఘాలు కలిసి గుంటూరులో రిజర్వేషన్ల పరిరక్షణ సంఘీభావ కమిటీగా ఏర్పడ్డాయి. దీని ఆధ్వర్యంలో 17-9-90న గుంటూరులో రిజర్వేషన్లకు మద్దతుగా బహి రంగసభ జరిగింది. విరసం సభ్యురాలు కా॥ రుక్మిణి ప్రసంగిస్తూ రిజర్వేషన్ లకు తమ మద్దతును ప్రకటించారు. 10-10-90న జరిగిన ఆంధ్రప్రదేశ్ బంద్‌లో భాగంగా సాయంత్రం బహిరంగసభ జరిగింది. ఈ సభలో విరసం కార్యవర్గసభ్యుడు కా॥ సి.యస్.ఆర్. ప్రసాద్ మాట్లాడుతూ, బూర్జువాపార్టీలన్నీ రిజర్వేషన్ల సమస్యపై గోడమీదిపిల్లి వాటంగా ఉన్నాయనీ, నిరుద్యోగం రద్దయితేగాని రిజర్వేషన్ల అవసరం తీరదనీ, నిరుద్యోగం, భూమిసమస్యతో ముడిపడివుందనీ అన్నారు.

మహబూబ్‌నగర్ జిల్లా యూనిట్

గద్వాలలో జులై 15న మున్సిపల్‌హాల్లో జరిగిన చెర సంస్మరణ సభకు కా॥ ఉదయ్ అధ్యక్షతవహించారు. ప్రధానవక్త కా॥ వేణుగోపాల్. జిల్లా సాహిత్యం - విప్లవోద్యమాలు అంశంగా అదే సభలో కా॥ వెంకట్రాములు మాట్లాడారు. స్థానిక JNM కార్యకర్తలు పాటలు పాడారు.

'సాహిత్యంపై విప్లవోద్యమాల ప్రభావం' అనే అంశంపై మహబూబ్ నగర్ టౌన్‌హాల్‌లో సెప్టెంబర్ 19న బహిరంగసభ జరిగింది. ప్రధానవక్త

కా॥ వరవరావు. పాలమూరు సాహిత్యంపై విప్లవోద్యమాల ప్రభావం గురించి కా॥ వెంకట్రాములు మాట్లాడారు.

సెప్టెంబర్ 27 నుండి 29 వరకు విలేజ్ క్యాంపేన్ ఐదుమంది విరసం సభ్యులతో జగత్‌పల్లి గ్రామంలో జరిగింది.

* జులై 28 తేదీన భీమవరంలో విరసం సభ్యుడు కా॥ జి. గంగాధర్ ఇంటిపైన 20 మంది పోలీసులు దాడిచేసి, ఇల్లు సోదాచేసి, సాహిత్యాన్ని తీసుకుపోయారు.

* విరసం కార్యవర్గ సభ్యుడు కా॥ వరవరరావు జననాట్యమండలి బృందంతో కలిసి మధ్యప్రదేశ్‌లో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఇటీవల బస్తర్‌లో ఆయనను పోలీసులు అరెస్టుచేశారు. మధ్యప్రదేశ్‌లో ఈ ప్రచార కార్యక్రమాన్ని ప్రభుత్వం నిషేధించింది. జననాట్యమండలి బృందంతోపాటు వరవరరావును ఆంధ్ర పరిహద్దులో వదిలిపెట్టారు.

స్వీకారం

1. శ్రీశ్రీ వ్యాసాలు : శ్రీశ్రీ సాహిత్య సర్వస్వం - 17 : విరసం ప్రచురణ, కూర్పు : చలసాని ప్రసాద్, 400 పేజీలు,
వెల : రూ. 45-00, కాపీలకు : నవయుగ బుక్‌హౌస్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్ - 500 195.
2. మానవస్మృతి : రిజర్వేషన్‌లపై పోరాటం. విప్లవ రచయితలసంఘం. జంటనగరాలు. కవితాసంకలనం. వెల : రూ. 2-00.
కాపీలకు : నవోదయ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ ఎదురు, కాచిగూడ, హైదరాబాద్.
3. రైతుకూలీల సమస్య సామాజిక ఆర్థిక సమస్య! : కుప్పం ప్రాంతంలో జరిగిన అటవీభూముల ఆక్రమణపై ఒక విశ్లేషణ. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం - చిత్తూరుజిల్లా యూనిట్. వెల : రూ. 1-50
కాపీలకు : రామయ్యపిళ్ళై, అడ్వకేటు, గాంధీరోడ్ ఎక్స్‌టెన్షన్, చిత్తూరు.
4. రిజర్వేషన్‌లు దళితుల ప్రజాస్వామిక హక్కు. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం - కృష్ణాజిల్లా శాఖ. వెల : రూ. 1-50.

కాపీలకు : ఎస్.ఎస్.సి దోస్, డా. రామనాథం చాంబర్ ఆఫ్ లా, పెద్దిబోట్లవారివీధి, గవర్నరుపేట, విజయవాడ-520 002.

5. మనలో మనం : సామాజిక అభివృద్ధి తీరుతెన్నులు గౌరవ సంపాదకుడు : కాశీపట్నం రామారావు. సాగర గ్రంథమాల, విశాఖ. వెల : 25 రూ. ప్రతులకు : నవోదయ పబ్లిషర్స్, విజయవాడ-2.

6. జీరుపాలెంలో దమనకాండ-జాలర్ల జీవన్మరణ సమస్య :-ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, విశాఖపట్నం. వెల రూ. 2-00. కాపీలకు : యు. వింధ్య, 5-ఎఫ్, క్లాసిక్ అపార్టుమెంట్సు, ఆర్. కె, బీచ్, విశాఖపట్నం-530 003

7. సింగరేణి బతుకులు : కథల సంపుటి. రచన : వి. యస్. వెల : రూ. 4-00. ప్రతులకు : కొత్తగూడెం బుక్ ట్రస్ట్, ఎస్. జె నగర్, ఖమ్మం-507 120.

8. చరిత్రలో రిజర్వేషన్లు రచన : కె. ఐలయ్య, ప్రజాస్వామ్యహక్కుల వేదిక. వెల : రూ. 2-00. కాపీలకు : ప్రగతి బుక్‌హౌస్, మ్యూజియంరోడ్, విజయవాడ-2.

9. నిశ్శబ్దం ద్విపద : కవితాసంకలనం. రచయిత : కలువకొలను రాంమోహన్‌రాజు. వెల : రూ. 8-00. కాపీలకు : అక్షరముద్ర, 16/818, రామన్నపేట, వరంగల్-506 002.

(57వ పేజి తరువాయి)

తోషిబా టివీతో
ఖుషీగా ఇంటికి చేరిన
'మోషేను' వార్త తెస్తాడు.
వార్త పత్రికల్లో రాదు-
నువ్ చెప్పినా-
మేం చూడలేదు కనుక
నువ్ చూసింది మేం రాయకూడదు,
రాసినా ఎడిటర్ వేయకూడదు.
ఎంచేతంటే-
పెదవి విప్పితే మనకు పెట్రోల్ రాదు
ప్రాణం "కన్నా - పెట్రోల్ మిన్న"
పరువు పోతే పోనియ్ - కన్నా !

[సఖినేటిపల్లికి చెందిన "కుమారి" అనే యువతి ఇరాక్ సైనికుల కాల్పుల్లో చనిపోయి కువైట్ రోడ్డుమీద పడిన శవాల్లో కళ్ళిపోతూ కన్పించిందని "మోషే" అనే ఆయన చెప్పాడు. ఆ వార్తను పత్రికలకు పంపినా వాళ్ళు వెయ్యలేదు.]

...వు పోతే పోనీయ్

—గూడవారి గంగాధరరావు

...త్రిహింసలు
...మానభంగాలు
...భలో నాటుబాంబులు
...ర్లమెంటులో పొగాకు వాసన -
...చర్చిలో సాహెబుగారు నమాజుచేస్తారు
మక్కాలో మన ముసలాయన
తొక్కిసలాటలో తుక్కయిపోతాడు
ఎక్స్‌గ్రేషియాకి అప్లై చేసినా
రిప్లై రాదు
శవాలు భద్రంగానే సప్లై అవుతాయి
కాశ్మీర్‌లో కుర్రాళ్ళు
నమాజులు మానేసి
సమాజంలో చేరిపోతారు
కాశ్మీర్ హిందువులు కూడా
రామశిలలు మోసుకొని
అయోధ్యకు పారిపోతారు
యుద్ధానికయినా
సిద్ధమేనంటాడు - సద్దాం,
యుద్ధమంటూ రాకుంటే సద్దామే హీరో
గల్ఫ్‌లో గోటీబిళ్ళాటకి
గురిపెట్టి చూస్తుంటాడు - బుష్,
హుష్... మనకెందుకని
గోళీలాడుకుంటాడు - గోర్బచేవ్.
పెట్రోలు ఎవాపరేటయి
రేటు పెరిగిపోతుంది
...గచూరిన వాసన పడక
ముక్కు మూసుకుని
గాల్లో ఈదుకుంటూ బైటికెళ్ళిపోయి
నెత్తిమీద చెంగుతో
ఇంటికొస్తాడు - గుజ్రాల్
గుజ్రాలలో సన్యాసివి
సమాజమా సిగ్గుపడమని గేలిచేస్తుంది.
ప్రతిభావంతుడు గొంతుచించుకుంటాడు
వెనకబడ్డవాడు వెనకే ఉంటాడు
ఇంకో 27 అడుగులు వెనక్కిపోతాడు
పోయేముందు
కొందర్ని ముందుకు తోసేసి పోతాడు
కొందరు విద్యార్థులు
ఆగస్టు 15న గాంధీకెయ్యాల్సిన దండలు
కొంచెం ఆలస్యంగా
అంబేద్కర్ కేసేశారు.
భారత రాజ్యాంగం దొరక్క
బైబిల్ తగలెట్టేశారు.
అస్సాంలో ఆయిల్ దిగ్బంధనంతో
నిల్వలు పెంచుతుంది - ఆసు.
ఆకాశవాణి కేక లేస్తూంటూంది
పత్రికలు పెట్రోల్ వార్తలకోసం
పడవలేసుకుని
బురదగుంటల్లో ప్రయాణిస్తుంటాయి.
ఈ సాయంత్రం వార్తలు
రేపుదయానికల్లా వస్తాయి
కానీ ఊరుదాటి బైటికి పొక్కవు.
కోనసీమ 'కుమారి' (సఖినేటిపల్లి)
కువైట్ రోడ్డుమీద
కుళ్ళిన శవాల్లో కన్పించిందని-

(కొంప 56వ పేజీలో)

KLVA101M105

124 ARUNA TARA OCT...
Annual Subscription Rs. 30/-

మీ భయమంతా....

నిజమే...

మీ కడుపు మంటకీ ఓ మంటుంది
మీ గావుకేకలకీ ఓ గోడుంది
మీ బాధకీ భయానికీ బలమైన కారణమే వుంది.
మీరు మూటలు మోసినా, పాలిష్ చేసినా
ఎత్తుమడాలేసి రోడ్లెంట ఎగిరెగిరి అరిచినా,
మీరు చెప్పులు కుట్టినా చీపుర్లు పట్టినా
చింపిరి బ్రతుకుల్ని దూషిస్తూ దండోరా వేసినా,
మీరు భిక్షమెత్తినా బందూకులు పట్టినా
లాఠీల నీడలో లూఠీలు చేసినా
మీరు హత్యలు చేసినా
హత్యల్ని ఆత్మహత్యలు చేసినా,
మీ బాధంతా ఒక్కటే
మీ గోడంతా ఒక్కటే
మీ మంటంతా ఒక్కటే
జబర్దస్తీ బ్రతుకంతా ఎక్కడ జారిపోతుందనే భయం
నెత్తురు మరిగిన "ప్రతిభ" లేకుండా పోతుందనే భయం
పాతుకుపోయిన పెత్తనం పాతరై పోతుందనే భయం
భయమే మీ మాలుగులలో చలి
భయమే మీ వెన్నుపూసలలో నిప్పు
మీ భయమంతా రిజర్వేషన్లు కాపు
చేజారిపోతున్న మీ రిజర్వ్‌డ్ బ్రతుకు.

—ప్రభాత్

Printed at Konarka Printers, Kavali on behalf of Venkatarama...
Printers, Guntur-1. Revolutionary Writers' Association

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M105
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	59
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Susmitha
పేజీలు విడదీసినది	Bhanusree
స్కాన్ చేసినది	akshaya
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good.